

ఆరణిని గెలిపిస్తాం

తిరుపతి సీటును బాబుకు కానుకగా ఇస్తాం
టీడీపీ ఇన్‌ఛార్జి సుగుణమ్మ ప్రకటన
కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కలిసిన ఆరణి

తిరుపతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : "చంద్రబాబు సీఎం కావడమే మా లక్ష్యం. సీఎంగా అసెంబ్లీకి వస్తానని ఆయన శపథం చేశారు. ఆ శపథం నెరవేరేలా పనిచేస్తాం. ఆయన ఆదేశాలకు అనుగుణంగా తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించి చంద్రబాబుకు తిరుపతిని కానుకగా ఇస్తాం." అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రకటించారు. సోమవారం జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు (జేఎంసీ) తన కుటుంబ సభ్యులు, జనసేన పార్టీ నాయకులతో కలిసి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ నివాసానికి వెళ్లారు. దాదాపు అరగంటకు పైగా రెండు కుటుంబాలు ఏకాంతంగా మాట్లాడుకున్నాయి. అనంతరం మీడియాతో సుగుణమ్మ మాట్లాడారు. జనసేన- టీడీపీ- బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు సద్దుమణిగాయని చెప్పారు. జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలను, నాయకులను కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని తెలియజేశారు. గత ఐదేళ్లుగా తిరుపతిలో సుగుణమ్మ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారని, వైసీపీ ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి తిరుపతి ప్రజలను వేధించారన్నారు. వైసీపీ నేతలు తిరుపతిని లూటీ చేశారని, టీడీఆర్ బాండ్లలో నిజమైన బాధితులకు న్యాయం చేస్తామన్నారు.తిరుపతిలో గంజాయి అమ్మకాలను అరికడతామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ నాయకులు భట్టే వెంకట కీర్తి, చిట్టిబాబు, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్, కంకణాల రజనీకాంత్ నాయుడు, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, ఆర్సీ శ్రీనివాస్, మునిరామయ్య, గోళ్ల లోకేశ్ నాయుడు, విశ్వనాథం, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంతో సుగుణమ్మ దాదాపుగా అలక వీడారని భావిస్తున్నారు.చంద్రబాబు రేణిగుంటలో తిరుపతి నేతలతో మాట్లాడిన తర్వాత వీరు చల్లబడ్డారని తెలుస్తోంది.


ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు పసుపు కండువాను కప్పుతున్న సుగుణమ్మ

పింఛన్ల పంపిణీలో ఆలస్యమా?

ఎమ్మెల్యే ఆదిమూలం మౌనదీక్ష


టీడీపీ నేతలతో కలిసి మౌనదీక్ష చేస్తున్న ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 1 : సామాజిక పెన్షన్ల పంపిణీలో ఆలస్యంపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మౌనదీక్ష చేపట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కూడా అయిన ఆదిమూలం నారాయణవనంలో పార్టీ నేతలతో కలిసి సాయంత్రం గంట సేపు దీక్ష చేపట్టారు.నగదు లోటు కారణంగానే పెన్షన్లు పంపిణీ చేయలేదని, అయితే జగన్, వైసీపీ నాయకులు కావాలనే టీడీపీ పైన బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.సచివాలయ సిబ్బంది ద్వారా వెంటనే పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు చేర్చాలని ఆదిమూలం డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు ఆర్డీ ఏకాంబరం, భాస్కరన్, గోవిందస్వామి, శివకుమార్, కేఎస్ రవి, గోవిందశెట్టి, రమేష్, సురేష్, విజయ్‌కుమార్, జయచంద్ర నాయుడు, కందస్వామి నాయుడు, వాసు, మల్లికార్జున రెడ్డి, మాణిక్యం రెడ్డి, రవిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నాక్ సభ్యురాలిగా నారాయణమ్మ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: యూజీసీ నాక్ పీర్ టీంలో సభ్యురాలిగా పద్మావతీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ నియమితులయ్యారు. ఉన్నత విద్యా సంస్థల్లోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి నాక్ గ్రేడింగ్ ప్రకటించే ప్రక్రియలో ఈమె భాగస్వామ్యం వహిస్తారు. టీటీడీ విద్యా సంస్థలకు సంబంధించి నాక్ పీర్ టీంకు ఎన్నికైన మొదటి వ్యక్తి ఆమే కావడం గమనార్హం. కామర్స్ అధ్యాపకురాలైన నారాయణమ్మ హాస్టల్ వార్డెన్‌గా, ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి.కృష్ణవేణి, పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

రైలు కిందపడి టీచర్ మృతి


కృష్ణప్రసాద్ (ఫైల్‌ఫొటో)

గూడూరు, ఏప్రిల్ 1: రైలు దిగుతుండగా కాలుజారి పడి ఓ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన గూడూరు రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని హరినాథపురంలో నివాసం వుంటున్న కృష్ణప్రసాద్(42) గూడూరు మండలం వెందోడు ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రోజూ నెల్లూరు నుంచి పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. సోమవారం నెల్లూరు నుంచి బిట్రగుంట - చెన్నై మెమో రైలులో గూడూరుకు వచ్చారు. మూడో నంబరు ప్లాట్‌ఫాంపై ఆగేందుకు రైలు నెమ్మదిగా వెళ్తుండగా కృష్ణప్రసాద్ కిందకు దిగబోయాడు. ఆ సమయంలో కాలుజారి రైలుకింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కాళంగినదిలో పడి యువకుడి మృతి

తడ, ఏప్రిల్ 1: స్నేహితులతో కలసి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతి చెందాడు.తడ మండల పరిధిలోని గ్రద్దగుంట దళితవాడకు చెందిన కుప్పంపాటి వెంకయ్య(28) శుక్రవారం మధ్యాహ్న సమయంలో నలుగురు మత్స్యకారులతో కలసి కాళంగినది వద్దకు వెళ్లాడు.అందరూ కలసి మద్యం సేవించి భోంచేశారు. స్నేహితులు నదిలో వలలు కట్టుకునే పనిలో ఉండగా వెంకయ్య నదిలోకి దిగి నీట మునిగిపోయాడు. స్నేహితులు అది గమనించకుండా వెళ్లిపోయారు. ఆదివారం సాయంత్రం కుటుంబసభ్యులు వెంకయ్య కోసం గాలిస్తుండగా తమతో పాటు వచ్చాడని, ఆ తరువాత కనబడలేదని స్నేహితులు చెప్పారు. దీంతో అందరూ కలసి నదివద్దకు వెళ్లి చూడగా మృతదేహం తేలుతూ కనిపించింది. వెంకయ్య మృతిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ శివప్రసాద్ ఆదాయ వనరులపై ఐటీ దృష్టి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 : రేణిగుంట మాజీ తహసీల్దార్ శివప్రసాద్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని అవినీతి నిరోధక శాఖ తనిఖీల్లో బయటపడడంతో ఆదాయ పన్ను శాఖ దృష్టి సారించింది. పన్నుల చెల్లింపునకు సంబంధించి వివరాలు ఆరా తీస్తోంది. తిరుపతి, పీలేరులో ఆయన కూడబెట్టిన ఆస్తులు, భార్య డాక్టర్ కావడంతో ఆమె ఆదాయ వనరులపైనా దృష్టి సారించింది. అధికారిక లెక్కల ప్రకారం రూ.100కు 30 శాతం ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా దాదాపు రూ.70 కోట్లకు రూ.21 కోట్లు ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంది. ఆ మేరకు చెల్లింపులు జరిగాయా లేదా అనేది చూస్తున్నారు.

సిలబస్ మార్పు చేర్పులపై రేపు తిరుపతిలో సమావేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 ప్రకారం సిలబస్‌లో మార్పు చేర్పులపై ఈనెల 3వ తేదీన తిరుపతిలో సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ సమావేశం చేపట్టనున్నారు. తొమ్మిది సైన్స్ నాలుగు ఆర్ట్స్ కోర్సులకు సంబంధించిన సిలబస్ రూపకల్పన బాధ్యతను ఉన్నత విద్యా మండలి ఈ దఫా పద్మావతి వర్సిటీ, యోగి వేమన వర్సిటీలకు అప్పగించింది. ఇరు వర్సిటీల అధికారులు, బీఓఎస్ ఛైర్మన్లు, అకడమిక్ వ్యవహారాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. మార్పు చేర్పులపై ఉన్నత విద్యా మండలికి నివేదించనున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం) : సా. 6.28
సహరి (బుధవారం) : ఉ. 4.48

పక్కా లోకల్...!

- ప్రశ్నార్థకంగా రక్షకభటుల బదిలీలు
- అధికారులకే పరిమితమైన ఎన్నికల కోడ్
- దశాబ్దాలుగా సొంత ప్రాంతాల్లో సిబ్బంది తిష్ఠ
- ఎన్నికల సమయంలో ప్రభావితం చేసే అవకాశం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 : పోలీసు శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చాలా చోట్ల దశాబ్దాలుగా ఒకే చోట పాతుకుపోయారు.వారిలో కొందరు రాజకీయ పార్టీలకు దాసోహం అయిపోయారు. ఎస్ఐ పైస్థాయి అధికారులు మాత్రమే కాలపరిమితి ముగిసిన తర్వాత బదిలీ అవుతున్నారు.హోంగార్డు నుంచి ఏఎస్ఐ వరకూ నిబంధనల ప్రకారం బదిలీ కావడం లేదు. ఎన్నికల కోడ్ సమయంలో తప్పనిసరిగా మూడేళ్ల కాల పరిమితి నిండిన అధికారులను బదిలీతో జిల్లా దాటిస్తుంటారు. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం చాలా మంది సంవత్సరాల తరబడి సొంత ప్రాంతాల్లో రకరకాల కారణాలతో కొనసాగుతుం డడంపై ప్రతిపక్ష పార్టీల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

శాంతిభద్రతల పరిరక్షణలో రక్షకభటుల పాత్ర ఎంత కీలకమైనదో అందరికీ తెలిసిందే. ప్రధానంగా ఎన్నికల సమయాల్లో నిష్పక్షపాతంగా భద్రతా వ్యవస్థ వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఉద్దేశంతోనే ఎస్ఐ స్థాయి నుంచి అధికారులకు తరచూ స్థానచలనం కల్పిస్తుంటారు. ఇక ఎన్నికల కోడ్ సమయంలో అధికారుల బదిలీలు తప్పనిసరిగా జరిగి తీరుతుంటాయి. అయితే పోలీసు శాఖలో కిందిస్థాయి సిబ్బంది చాలామంది ఎక్కడివారు అక్కడే రాజకీయ బలంతో పాతుకుపోయారు. వాస్తవానికి సొంత మండలంలో, సబ్ డివిజన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌కు ఎప్పుడూ విధులు కేటాయించకూడదు. కానీ జిల్లావ్యాప్తంగా చాలామంది కానిస్టేబుళ్లు సొంత మండలాల్లోనే దశాబ్దాలుగా గడిపేస్తున్నారు. ఒకే సబ్ డివిజన్ పరిధిలో ఇలా 28 ఏళ్లగా పనిచేస్తున్న వారు కూడా ఉండడం గమనార్హం. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఒకే డివిజన్‌లో పోలీస్ స్టేషన్లు మారుతూ రింగ్ మాస్టర్లుగా అక్కడే తిరుగుతున్నారు. శ్రీకాళహస్తిలో అలాగే చాలామంది రిటైరయ్యారు కూడా.ఇదిలా ఉండగా కొందరు వేరే సబ్ డివిజన్‌కు బదిలీ అయిన తర్వాత కూడా ఎస్పీ స్థాయి అధికారి ఇచ్చే అటాచ్మెంట్(డిప్యుటేషన్)తో వారికి కావాల్సిన స్థానాల్లో కొలువుదీరిపోయారు.తిరుపతి జిల్లాలో ఇలాంటి వారు 40శాతం దాకా వున్నారని సమాచారం. ఒక శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో సుమారు 50మంది దశాబ్దాలుగా సొంత స్థావరం లోనే అటూ ఇటూ తిరుగుతున్నారు.సొంత స్థావరాల్లో క్షేత్రస్థాయి రక్షకబటులు వేళ్లానుకుపోవడంతో అధికారులకు తలనొప్పులు తప్పడం లేదు. బయట ప్రాంతం నుంచి వచ్చిన అధికారులు స్టేషన్లో పాతుకు పోయిన సిబ్బందిని గట్టిగా ఆదేశించి విధులు కేటాయించలేకపోతున్నారు.పలు సందర్భాల్లో అధికారుల పైనే స్థానిక బలంతో సిబ్బంది తిరగబడిన ఘటనలు న్నాయి.శాంతిభద్రతల సమస్యలు ఎదురైనా, అలాగే ఫిర్యాదులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమయాల్లోనూ క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. పోలీసులు స్థానికులు కావడంతో గట్టిగా ఆకతాయిలను కూడా మందలించలేకపోతున్నారు. అన్నీ తెలిసినా నాన్ లోకల్ భయంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నట్లు తరచూ వాపోతుంటారు. ఇటీవల శ్రీకాళహస్తిలోని ఒక స్టేషన్లో జరిగిన ఘటన అందరినీ విస్మయానికి గురి చేసింది. ఒక సీఐ తమ శాఖ ఉన్నతాధికారి ముక్కంటి ఆలయానికి వచ్చిన సమాచారం తనకు ఎందుకు చెప్పలేదని కానిస్టేబుల్‌ను ప్రశ్నించాడు. దీంతో ఆ కానిస్టేబుల్ పోలీస్ స్టేషన్లో సిబ్బంది చూస్తుండగానే సీఐకి దురుసుగా సమాధానం ఇచ్చాడు. దాంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.అంత జరిగినా ఆ అధికారి ఎవరికీ చెప్పుకోలేక లోలోపల మధనపడుతూనే తరువాత బదిలీపై వెళ్లిపోయాడు. ఇక వివాదాలు, ఆరోపణలు ఎదుర్కొన్న ఎందరో సిబ్బంది తమ రాజకీయ బలంతో ఏడాది కూడా తిరగకముందే తిరిగి అదే స్టేషన్లో పోస్టింగ్ పొందుతున్నారు.ఇక ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది తీవ్ర ప్రభావితం చేసే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల పోలీస్ స్టేషన్లో కొత్త అధికారులు కొలువుదీరారు.వారు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్న ఉద్దేశంతో ఏ నిర్ణయం తీసుకున్నా క్షణాల్లో అధికార పార్టీ నాయకులకు చేరిపోతోంది. అన్ని పోలీస్ స్టేషన్లలో స్థానికులుండడం అధికార పార్టీకి వరంగా మారింది. ఒకే చోట ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న వారికి బలమైన పరిచయాలు ఏర్పడ్డాయి. అదే ప్రాంతాల్లో రేపు పోలింగ్ బూత్‌ల వద్ద క్షేత్రస్థాయి విధులు కేటాయించాల్సి ఉంటుంది. దాంతో ఒకే చోట పుట్టి, పెరిగి, విధులు నిర్వహించిన సిబ్బంది చాలా సులభంగా ప్రజలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. అలాగే రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించేందుకు కూడా వారికి చాలా అవకాశం ఉంది.క్షేత్రస్థాయి పరిస్థితులను లోతుగా పరిశీలించి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ చిరకాలంగా పాతుకుపోయిన రక్షకభటులను బదిలీ చేసే ప్రక్రియను ఉన్నతాధికారులు చేపట్టాల్సివుంది.

తిరుమల ఘాట్‌లో అదుపు తప్పిన బస్సు

చెట్టును ఢీకొని ఆగడంతో బయటపడిన ప్రయాణికులు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్డులో సోమవారం పెనుప్రమాదం తప్పింది. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. చెట్టును ఢీకొనడంతో లోయలోకి దూసుకుపోకుండా ప్రమాదం తప్పింది. విజిలెన్స్ అధికారులు వివరాల మేరకు.. ఏపీ 03 జెడ్ 5617 నెంబరు గల ఆర్టీసీ బస్సు 15 ప్రయాణికులతో సోమవారం మధ్యాహ్నం తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరింది. హరిణి ప్రాంతానికి సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి ఎడమవైపు పిట్టగోడను బలంగా ఢీకొంది. గోడసైతం పగిలిపోవడంతో ముందుకు దూసుకువెళ్లి చెట్టును ఢీకొని ఆగిపోయింది. బస్సులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. చెట్టు లేకుంటే లోయలోకి దూసుకుపోయి పెద్ద ప్రమాదం వాటిల్లి ఉండేది. విషయం తెలుసుకున్న పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ మొదలుపెట్టారు. ప్రమాద నేపథ్యంలో కొంతసేపు వాహనాలు నిలిచిపోయాయి. బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

18ఏళ్లు నిండినవారు ఓటుకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : జిల్లాలో సోమవారం నాటికి 18 సంవత్సరాలు నిండినవారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. దరఖాస్తుదారులకు వచ్చేనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఓటు హక్కు కల్పిస్తామని పేర్కొన్నారు. 14వ తేదీ తర్వాత వచ్చే దరఖాస్తులను ఎన్నికల తర్వాత పరిశీలిస్తామని వివరించారు. ఓటరు హెల్ప్‌లైన్‌యాప్, బీఎల్వో ద్వారా ఫారం 6 దరఖాస్తు చేసి ఓటు హక్కును పొందవచ్చునని తెలిపారు. కొత్తగా ఓటు పొందడానికి ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు.

33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1: పోలింగ్ రోజున విధుల్లో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ కల్పిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సమయంలో అత్యవసర సేవలు అందించే 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కేటాయించడంపై ఆయన సమీక్షించారు. సంబంధిత శాఖలకు చెందిన ఫారం 12డి దరఖాస్తును పూరించి ఈ నెల 22వ తేదీలోపు సంబంధిత ఆర్వో, ఏఆర్వోలకు అందజేయాలన్నారు. ఆర్వో, ఏఆర్వో వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ ఏర్పాటు చేస్తారని, సదరు ఉద్యోగులు అక్కడికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని అన్నారు.

వలంటీర్లపై రాజీనామాలకు ఒత్తిడి

కోట, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వలంటీర్లను ప్రచారానికి వాడుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజీనామాలు చేసి వైసీపీ తరపున ప్రచారం చేస్తే అధికారంలోకి వచ్చాక అదే వలంటీర్ పోస్టులు తిరిగి ఇస్తామంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు.కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రెండు వారాల నుంచి ఈ వ్యవహారం సాగుతోంది.ఒక వైసీపీ నాయకుడు ఒక వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసి ఆ సచివాలయ పరిధిలోని వలంటీర్లను ఆ గ్రూపులో సభ్యులుగా చేరుస్తున్నారు.స్వచ్ఛందంగా వలంటీరు పోస్టులకు రాజీనామా చేసి వారి పరిధిలో ఉన్న గృహాలకు వెళ్లి పింఛన్లు, పొదుపు గ్రూపు సభ్యులు, ఆసరా, చేయూత లబ్ధిదారులను ఫ్యాన్ గుర్తుకు ఓటువేయించే బాధ్యత తీసుకోవాలని గ్రూపుల్లో మెసేజ్‌లు ఫార్వార్డ్ చేస్తున్నారు. పొరపాటున చంద్రబాబుకు సైకిల్‌గుర్తుపై ఓటువేస్తే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని ప్రచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.అందుకు నిరాకరించిన వలంటీర్లను బెదిరిస్తున్నట్లు సమాచారం.ఆదివారం కొన్ని మండలాల్లో అనుకూలమైన వలంటీర్లతో వైసీపీ నేతలు సమావేశాలు కూడా పెట్టుకున్నట్లు సమాచారం.

సర్టిఫికెట్లు జారీ చేసే వారేరీ?

విద్యార్థుల భవిష్యత్తుతో అధికారుల చెలగాటం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1: అధికారులు సర్టిఫికెట్లు జారీ చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యా సంవత్సరం ముగింపు సమయంతో పాటు పలు ప్రవేశ పరీక్షలకు కూడా ఇది అత్యంత కీలకమైన సమయం. ఎంసెట్, పాలిసెట్ వంటి ప్రవేశ పరీక్షల కోసం పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సిఉంటుంది. అందుకోసం కుల, ఆదాయ, స్థానికత వంటి ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా జత చేయాలి. వీటిని రెవెన్యూ అధికారులు సకాలంలో దరఖాస్తుదారులకు జారీ చేయాలి.సకాలంలో దరఖాస్తు చేసుకోకపోతే ఒక విద్యా సంవత్సరం వృధాగా మారే ప్రమాదం లేకపోలేదు. శ్రీకాళహస్తిలో సచివాలయాల ద్వారా సర్టిఫికెట్ల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేవారు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి సర్టిఫికెట్లు జారీ చేసేవారు.పది రోజులనుంచి సచివాలయాల్లో విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదు. దాంతో మీసేవ కేంద్రాల్లో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆ తర్వాత సర్టిఫికెట్ కోసం దరఖాస్తు రశీదుతో విద్యార్థుల తల్లిదండ్రులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఎన్నికల విధుల పేరుతో సామాన్య జనానికి రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండడం లేదు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగిన తర్వాత మీసేవ నుంచి చేసిన దరఖాస్తు పనిచేయదంటూ చావు కబురు చల్లగా చెబుతున్నారు. దాంతో మళ్లీ లబోదిబోమంటూ సచివాలయాల వెంట పడుతున్నారు. అక్కడ దరఖాస్తులను స్వీకరించడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సర్టిఫికెట్ల జారీపై శ్రద్ధ వహించాల్సివుంది.

ఒంగోలు దోపిడీకి చెవిరెడ్డి సిద్ధం

సిద్ధం సభలకు పింఛన్ల డబ్బు - కాదనే దమ్ము చెవిరెడ్డికి ఉందా? - టీడీపీ నేత పులివర్తి నాని సవాల్


మీడియాతో మాట్లాడుతున్న పులివర్తినాని

తిరుపతి రూరల్, ఏప్రిల్ 1 : చంద్రగిరి ఎమ్మెల్యేగా రూ.5వేల కోట్లు దోచేసి ఇప్పుడు ఒంగోలును దోపిడీ చేసేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి సిద్ధమయ్యారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ధ్వజమెత్తారు. తిరుపతి రూరల్ మండలంలోని పైడిపల్లెలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.చంద్రగిరిలో పుట్టిన చంద్రబాబు కుప్పానికి పారిపోయారని ఒంగోలులో చెవిరెడ్డి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెనుకబడ్డ కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దిన చంద్రబాబుని విమర్శించే స్థాయి చెవిరెడ్డికి లేదన్నారు.తనకు ఎలాంటి వ్యసనాలు, వ్యాపారాలు లేవని నిబద్దతతో రాజకీయాలు చేస్తున్నానని చెప్పుకుంటున్న చెవిరెడ్డికి డబ్బు అనే వ్యసనం బాగా వుందన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎర్రచందనం, ఇసుక, మట్టి, మఠం, ప్రభుత్వ భూములను కబ్జాచేసి రూ.5వేలకోట్లు దోచేసి.. ఇప్పుడు ఒంగోలులో ఉన్న రామాయపట్నం, వాన్‌పిక్, ఇతర భూములను దోచుకునేందుకు మకాం మార్చారని మండిపడ్డారు. '2019 తర్వాత ఏర్పాటు చేసిన చెవిరెడ్డి మునిరెడ్డి రోశమ్మ ఇన్‌ఫ్రా, మైక్రోప్ టెక్నాలజీస్, క్యాంప్ మాన్ పవర్ సర్వీసెస్, సీఎంఆర్ అగ్రి క్రాఫ్ట్, సీఎంఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలు నీ కుమారులు, నీ కుటుంబ సభ్యులవి కావా' అని ప్రశ్నించారు. నాయుడుపేట, గూడూరు, సత్యవేడు, చంద్రగిరి, మంగళం, రేణిగుంట విమానాశ్రయ ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు, తాడేపల్లె, తిరుపతి, తుమ్మలగుంట, హైదరాబాద్‌లలో విల్లాస్, పెద్దభవంతులు ఎలా వచ్చాయని నిలదీశారు. తుడా నిధులను భారీగా దుర్వినియోగం చేశారన్నారు. అవినీతితో సంపాదించిన పాపపు సొమ్మును ప్రజలకు పంచుతున్నారని ఆరోపించారు.పింఛన్ల డబ్బును సిద్ధం సభలకు వెచ్చించి ఇప్పుడు నగదు లేదని పైగా టీడీపీపై బురద జల్లడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చంద్రగిరిలోని పంచాయతీల్లో 10-12మంది చొప్పున సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారి ద్వారా ప్రజలకు పెన్షన్లను పంపిణీ చేయాలని కోరారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కుమారరాజారెడ్డి మాట్లాడుతూ అవినీతి పరుడు కాదని కాణిపాకంలో చెవిరెడ్డి ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

పైడిపల్లెలో టీడీపీ ప్రచారం

తిరుపతి రూరల్ మండలంలోని పైడిపల్లె గ్రామంలో నాని పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు తల్లిపాల నిధి ప్రారంభం


పోస్టరును ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 1: రోటరీ గ్లోబల్ గ్రీన్ టౌన్ రోటరీ క్లబ్ మలేషియా వారి సౌజన్యంతో మదర్స్ మిల్క్ బ్యాంక్ (తల్లిపాల నిధి)ని తిరుపతి ప్రసూతి వైద్యశాలలో బుధవారం ప్రారంభించనున్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు టెంకాయల దామోదరం, హేమచందర్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ దేశంలో వివిధ కారణాలరీత్యా తల్లిపాలకు నోచుకోని 8లక్షల మంది చిన్నారులు ఉన్నారని, పోషకాహార లోపంతో అనారోగ్యానికి గురై మరణిస్తున్నారని, అలాంటి మరణాలను తగ్గించేందుకు ఈ బ్యాంకును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇది మొదటి ప్రాజెక్టు అని, ఆరోగ్యకరమైన తల్లులు తమవంతు సహకారం అందించాలని కోరారు. పూర్తి వివరాలకు రోటరీక్లబ్ 8008028290, ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల 0877-2230367, 9866357503లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదానం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 1: స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన తిరుచానూరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.భాస్కర్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం అన్నదానం, పశువులకు దాణా దానం చేశారు. వేదాంతపురంలోని పాస్ అనాథాశ్రయంలో అన్నదానం చేశారు. అలాగే పద్మావతీపురంలోని మనోవికాస్ సంస్థలో అనాథలకు అన్నదానం చేశారు. తిరుచానూరులోని గోశాలకు ఓ లోడ్ వరి గడ్డిని అందజేశారు. ఏఆర్ ఎస్‌ఐ తిరుపతిలో నిర్వహిస్తున్న మాతృసేవా సంస్థ అనాథ శవాల దహన క్రియలకుగాను ఆర్థిక సాయం అందజేశారు.

ఏపీపీఎస్సీ కుంభకోణంపై సీఎం, గౌతం సవాంగ్‌లపై కేసు నమోదు చేయండి

డీఎస్పీకి టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఫిర్యాదు


డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 1 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌లో జరిగిన కుంభకోణంపై ముఖ్యమంత్రి జగన్, ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతం సవాంగ్‌పై కేసు నమోదు చేయాలని టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు తిరుపతి డీఎస్పీ సురేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు, యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందగౌడు, తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకు అన్యాయం చేసేలా గౌతం సవాంగ్ వ్యవహరించారని తెలిపారు. తెలుగు యువత నాయకులు గాలి పవన్ చౌదరి, లోకేష్, ప్రసన్న, వెంకటేష్ యాదవ్, సాయికుమార్, కోటాక లక్ష్మణ పాల్గొన్నారు.

అవ్వాతాతల పింఛన్లతో ఆటలొద్దు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 1: అవ్వాతాతల పింఛన్లతో ఆటలొద్దని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం తాత్కాలికంగా మాత్రమే వలంటీర్లను పక్కన పెట్టిందన్నారు. సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయమంటే రాష్ట్ర ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతోందన్నారు. ప్రభుత్వం తీరు ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు.

వడగాల్పులపై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : వడగాల్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. విజయవాడ నుంచి సోమవారం జిల్లా యంత్రాంగంతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. వేసవి నేపథ్యంలో వడగాల్పులపై అవగాహన కల్పించడమేగాక ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్వో పెంచలకిషోర్, అధికారులు శ్రీనివాసప్రసాద్, విజయకుమార్, సుశీలదేవి, ప్రభావతి పాల్గొన్నారు.

పవన్‌తో పొలకల భేటీ

తిరుపతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను కాంగ్రెస్ తిరుపతి నగర మాజీ అధ్యక్షుడు పొలకల మల్లికార్జున్ సోమవారం పిఠాపురంలో కలిశారు. తిరుపతిలో రాజకీయ పరిణామాలపై చర్చించారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో పొలకల క్రియాశీలకంగా పనిచేసి, ఆయన గెలుపులో కీలకపాత్ర పోషించారు. పీఆర్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తర్వాత ఆయన కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేసి కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. త్వరలోనే ఆయన జనసేన పార్టీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఘనంగా సాయిసుధా స్కూల్ వార్షికోత్సవం


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ సుకుమార్, డాక్టర్ సుధారాణి

తిరుపతి(రూరల్),ఏప్రిల్1: తిరుపతి రూరల్ మండలంలో పేరూరు పంచాయతీ పరిధిలోని నలందనగర్‌లో ఉన్న శ్రీసాయిసుధా ఇంగ్లీషు మీడియం స్కూల్ ఐదో వార్షికోత్సవం సోమ వారం ఘనంగా జరిగింది. సాయిసుధా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, డైరెక్టర్ డాక్టర్ బద్దెల సుకుమార్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని, చదువు ద్వారా జ్ఞానం సంపాదించాలని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం వెంకటకృష్ణ, మేనేజర్ పుష్ప, టీచర్లు శిల్ప, జీవన, మురళి, బాబు, శారద, వనిత, చంద్రశేఖర్, మౌనిక, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ ఉపాధ్యక్షుడిగా చెంగల్రాయులు



రామచంద్రాపురం, ఏప్రిల్ 1: ఆర్‌సీపురం మండలం పరమాలపల్లె దళితవాడకు చెందిన మన్నంపల్లి చెంగల్రాయులును తిరుపతి నగర టీడీపీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా చెంగల్రాయులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సుగుణమ్మకు కృజ్ఞతలు తెలిపారు.

ఎంబీయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



చంద్రగిరి, ఏప్రిల్ 1: ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం నావిగేటింగ్ ది ఫ్యూచర్ ట్రెండ్ అండ్ స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. ఈ సదస్సుకు మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ప్రకాష్ సాయి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సదస్సు మూడు రోజులపాటు జరగనుంది. ఈ కార్యక్రమంలో తిరుపతిలోని ఐసర్ ప్రొఫెసర్ భానుశ్రీరెడ్డి, రిజిస్ట్రార్ సారథి, సదస్సు కన్వీనర్ కులదీప్‌కుమార్, జాయింట్ కన్వీనర్ కృపావతి, వివిధ పాఠశాలల డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వారపు సంతలో గేటు వసూళ్లు

పాకాల, ఏప్రిల్ 1: పాకాల వారపుసంతలో సోమవారం పంచాయతీ ఆధ్వర్యంలో గేటు వసూళ్లు చేశారు. వారపుసంత వేలం పాట ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్న కారణంగా అధికారులు వాయిదా వేశారు. ఏప్రిల్ 1వ తేది ఆర్థిక సంవత్సరం మొదలు కావడంతో వారపు సంతలో వ్యాపారులు, రైతుల వద్ద నుంచి పంచాయతీ సిబ్బంది గేటు వసూళ్లు చేశారు. గతేడాది ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హామీతో గేటు వసూళ్లు చేయకుండా రైతులు, వ్యాపారులకు ఉచితం చేశారు. దీంతోపాటు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు. పంచాయతీ సిబ్బంది నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేశారని, చాలామందికి రసీదులు ఇవ్వలేదని వాపోయారు.

తిరుమలలో 30 పోలీస్ యాక్ట్ అమలు

తిరుమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్టు డీఎస్పీ శ్రీనివాసాచారి తెలిపారు. సోమవారం నుంచి మే 1వ తేదీ వరకు అమలులో ఉండనున్న క్రమంలో తిరుమలలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలకు సంబంధించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొండపల్లివాసికి విశాఖవాసి గుండె


పద్మావతి హృదయాలయ ఆస్పత్రికి గుండెను తరలిస్తున్న వైద్యసిబ్బంది

తిరుపతి(వైద్యం)/విశాఖపట్నం, ఏప్రిల్ 1 : తిరుపతిలోని పద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో మరో గుండె మార్పిడి ఆపరేషన్ జరిగింది.బ్రెయిన్‌డెడ్ అయిన విశాఖవాసి గుండెను ఎన్టీఆర్ కృష్ణా జిల్లా యువకుడికి అమర్చారు.వివరాల్లోకి వెళితే..ఎన్టీఆర్ కృష్ణా జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన మంగళగిరి రాకేష్ కుమార్(36) కొంతకాలంగా గుండె సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 13వ తేదీన జీవన్‌దాన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నాడు. గుండె లభించిందని తెలియడంతో నాలుగు రోజుల కిందట శ్రీ పద్మావతి హృదయాలయంలో చేరాడు. విశాఖకు చెందిన కె.రాజు(38) రోడ్డుప్రమాదంలో గాయపడి షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేరాడు. బ్రెయిన్‌డెడ్ కావడంతో అతడి గుండెను రాకేష్ కుమార్‌కు అమర్చేందుకు గ్రీన్ ఛానల్ ద్వారా సోమవారం రాత్రి 10.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి తీసుకువచ్చారు.అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతికి తరలించారు.పద్మావతి హృదయాలయ ఆస్పత్రికి వైద్య బృందం ఆధ్వర్యంలో రాత్రి 12.30 గంటలకు గుండెను తీసుకువచ్చారు.అప్పటికే గుండె మార్పిడి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసి వుండడంతో రాకేశ్‌కుమార్‌కు గుండెను అమర్చారు.

ఉద్యోగాలు సృష్టించే ఆలోచనలు చేయాలి

ఐకార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్‌సీ అగర్వాల్


లేబొరేటరీలను పరిశీలిస్తున్న అగర్వాల్, శారదా జయలక్ష్మిదేవి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 1 : వ్యవసాయ విద్య చదివే విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా అధునాతన సాంకేతికతను ఉపయోగించి ఉద్యోగాలు సృష్టించే సరికొత్త ఆలోచనలు చేయాలని భారత వ్యవసాయ పరిశోధనా మండలి(ఐకార్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ పేర్కొన్నారు. తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలను సోమవారం ఆయన సందర్శించారు. జాతీయ ఆహారభద్రత, పోషక భద్రత యువ శాస్త్రవేత్తల చేతుల్లో ఉందని, ఈ దిశగా వినూత్న ఆలోచనలతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అధిక దిగుబడులు ఇచ్చే కొత్త రకాలను ఆవిష్కరించాలని సూచించారు. ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఐడీపీ)పథకంలో భాగంగా కళాశాలలో కల్పించిన ఆధునిక సౌకర్యాలు, వ్యవసాయ విధానాలు, పరిశోధనల గురించి విదేశాల్లో పర్యటించిన అధ్యాపకుల, విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శారదా జయలక్ష్మిదేవి, వర్సిటీ డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్, అగ్రి ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, ఏడీ డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి, ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ మురళీకృష్ణ, పరిశోధనా ప్రాజెక్టుల ప్రత్యేక అధికారి డాక్టర్ పి.సుధాకర్, ఈసీ సభ్యుడు డాక్టర్ వీవీ సత్యగోపాల్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


పరదాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న మణి

తిరుమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9న ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారు. తర్వాత సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతా ప్రోక్షణం చేసి, ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

శ్రీవారికి విరాళంగా నూతన పరదాలు

తిరుమల శ్రీవారికి సోమవారం ఐదు పరదాలు విరాళంగా అందాయి. తిరుపతికి చెందిన పరదాల మణి కొన్నేళ్లుగా శ్రీవారికి పరదాలను అందజేస్తున్నారు. సోమవారం ఐదు పరదాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి శ్రీవారికి సమర్పించారు. 26 ఏళ్లుగా తాను శ్రీవారికి పరదాలు అందజేస్తున్నట్టు తెలిపారు. శ్రీవారి ఆలయంలో ఏడాదిలో నాలుగుసార్లు జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ముందు రోజు పరదాలు అందజేయడం తనకు ఆనవాయితీగా వస్తోందన్నారు.

భక్తుల పాలిట కల్పవల్లి సుగుటూరు గంగమ్మ

నేటినుంచి పుంగనూరు గంగజాతర



పుంగనూరు, ఏప్రిల్ 1: భక్తులపాలిట కల్పవల్లిగా, ఆరోగ్య వరప్రదాతగా పేరుగాంచిన పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర జమీందారీ వంశస్తుల ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏటా ఉగాది పండుగకు ముందు వచ్చే మంగళవారం పుంగనూరుతో పాటు పరిసర 100గ్రామాల్లో గంగజాతర నిర్వహిస్తారు. పుంగనూరు జమీందారుల ఇలవేల్పు అయిన సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం ప్రారంభమై బుధవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనంతో ముగుస్తుంది. మంగళవారం పుంగనూరులో భారీఎత్తున గొర్రెపొట్టేళ్ల సంత జరుగుతుంది.

గెరిగెలతో మొక్కులు ప్రత్యేకం

ఈ జాతరలో బెల్లం పానకం, పసుపునీరు, మజ్జిగ కుండల్లో నింపుకొని గెరిగెలు నెత్తిన పెట్టుకొని భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. స్త్రీలు, పురుషులు గంగవేషాలు వేసుకుని పురవీధుల్లో గెరిగెలతో పాదమండపం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. జంతు బలులు ఇస్తారు.

ఒక్కరోజే దర్శనం

కోపమూర్తులైన సుగుటూరు గంగమ్మ, నడివీధి గంగమ్మను ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే జాతర సందర్భంగా జనం మధ్యకు తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తారు. జమీందారి సంతతి వారు ప్యాలెస్‌లో మంగళవారం తొలి పూజ తర్వాత అష్ట గంగమ్మలైన పాత బస్టాండు సమీపంలోని విరూపాక్షి మారెమ్మ, తూర్పుపాలెంలో స్థలగంగమ్మ, పలమనేరు రోడ్డులోని మల్లారమ్మ, తూర్పు మొగసాలలోని నల్లగంగమ్మ, కట్టకిందపాళ్యంలోని పడమటి గంగమ్మ, పుంగమ్మకట్టపై నీళ్లరాళ్ల గంగమ్మ, కోనేరు వద్దగల బోయకొండ గంగమ్మలను పలకరిస్తూ ఊరేగింపు సాగుతుంది. బుధవారం తెల్లవారుజామున ప్యాలెస్ వద్ద ఉన్న ఆలయంలో ప్రతిష్ఠించి బెస్త, యాదవ, తోటి కులస్తులు పూజలు చేస్తారు. కాగా, సోమవారం మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జమీందారులు సోమశేఖర్ చిక్కరాయులు, మల్లికార్జున చిక్కరాయులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి, పలువురు ప్రముఖులు గంగమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు. రెండ్రోజులపాటు భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తీరుపై విచారణ

తిరుపతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ఎర్రావారిపాలెం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవిపై ఇటీవల శాఖాపరమైన విచారణ జరిగింది.మోడల్ స్కూల్ వ్యవస్థలో పని చేసే ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో సర్వీస్ రూల్స్ ఫ్రేమ్ కాలేదు.ప్రిన్సిపాల్ సాంవత్సరిక నివేదికపైనే పొరుగు సేవల ఉపాధ్యాయుల ఉద్యోగం కొనసాగింపు ఆధారపడి వుంటుంది.ఇక్కడ పనిచేసే ఓ దళిత ఉపాధ్యాయురాలు తనకు సెలవు మంజూరు చేయకుండా ప్రిన్సిపాల్ వేధిస్తున్నారంటూ గతంలో ఆర్జేడీ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు.ఈ విషయం తెలిశాక ప్రిన్సిపాల్ శ్రీదేవి సదరు ఉపాధ్యాయురాలికి ప్రసూతి సెలవులు, పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయకపోవడంతో వివాదం జటిలమైంది.దీంతో టీచర్ తన బాధను విద్యాశాఖ కమిషనర్‌తో పాటు హక్కుల సంఘానికి, జాతీయ ఎస్సీఎస్టీ కమిషన్‌కు చాలాకాలం క్రితం మొర పెట్టుకుంది.ఈ నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలతో తిరుపతి విద్యాశాఖ ఏడీ లక్ష్మీనారాయణ ఇటీవల ఎర్రావారిపాలెం మోడల్ స్కూల్‌కు వెళ్లి ప్రిన్సిపాల్ శ్రీదేవిని విచారించారు. పాఠశాలలో ఉపాధ్యాయులతో విడివిడిగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.మూడు రోజుల క్రితం ప్రిన్సిపాల్ శ్రీదేవి తిరుపతి డీఈవో కార్యాలయంలో అధికారులను కలిసి ఫిర్యాదుపై తన వాదన విన్పించినట్లు సమాచారం. ఇటీవల పరీక్షలు అయ్యాక ఇంటర్ విద్యార్థి అదృశ్యం కావడం, ఉపాధ్యాయులతో సఖ్యత లేక విద్యాప్రమాణాలు అడుగంటుతుండడంతో 10వ తరగతిలోనే 15మంది విద్యార్థులు టీసీలు తీసుకుని పక్క పాఠశాలలకు వెళ్లడం తదితరాల గురించి అధికారులు ఆమెను ప్రశ్నించినట్లు సమాచారం.ఈ విషయమై డీఈవో శేఖర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశంతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి తీరుపై విచారణ జరిపించినట్లు తెలిపారు.విచారణ నివేదికను కూడా ఉన్నతాధికారులకు సమర్పించడం జరిగిందని వివరించారు.

నేటినుంచి ముత్యాలమ్మ జాతర


బంగారుచీర అలంకరణలో ముత్యాలమ్మ, పోలేరమ్మ

చిల్లకూరు, ఏప్రిల్ 1: చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మంగళవారం రాత్రి గంగమిట్ట మీద ఘటం నిలిపి కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తీసుకువచ్చి తాటాకు గుడిసెలో తాత్కాలికంగా ప్రతిష్ఠించడంతో జాతర మొదలవుతుంది. జాతరలో ముత్యాలమ్మతో పాటు పోలేరమ్మకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. జాతరలో భాగంగా 2వ తేదీన మంగళవారం రాత్రి పోలేరమ్మ నిలుపుదల, 3న యార గురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం, గొల్లల వేడుకలు, 4వ తేదీ పగలు గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మణ్ణి ఉయ్యాల సేవ జరుగుతుంది. 5న శుక్రవారం ఉదయం పోలేరమ్మను సాగనంపే ఉత్సవం, వేలంపాటలు నిర్వహిస్తారు.జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. అమ్మవారి జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమినాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రానున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో భక్తులకు సౌకర్యార్థం తాగునీరు, వైద్య సదుపాయం, మరుగుదొడ్ల ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు వివిధ సేవాసంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందజేయనున్నారు. రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గూడూరు, నెల్లూరు, కోట, వాకాడు, చిట్టమూరు, గుమ్మళ్లదిబ్బ, నాయుడుపేట, సూళ్లూరుపేట, నెల్లూరు, వెంకటగిరి నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు.జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు.

జలకంఠేశ్వరస్వామికి తిరుమంజనం

రామచంద్రాపురం, ఏప్రిల్ 1: రాయలచెరువుకట్ట సమీపంలోని భవానీ జలకంఠేశ్వరస్వామికి సోమవారం తిరుమంజనం వైభవంగా జరిగింది. శివరాత్రి తరువాత మూడో సోమవారం స్వామివారికి మృత్యుంజయ హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు.

ఎ.రంగంపేటలో టీడీపీ నేతల ప్రచారం



చంద్రగిరి, ఏప్రిల్ 1: చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట పంచాయతీలో సోమవారం టీడీపీ నాయకులు మీ ఇంటికి మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ యువనేత పులివర్తి వినీల్ ఇంటింటా తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలలో తన తండ్రి పులివర్తి నానిని చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, తెలుగు మహిళా కార్యదర్శి సింగు సుధా, నాయకులు బెల్లంకొండ రమేష్‌రాయల్, పచ్చిపాల కిషోర్, దేవిలాల్, గుడిమల్లం చెంగ్రాయాచారి, గోపాల్‌రెడ్డి, మబ్బు జ్ఞానశేఖర్, చిత్తూరు పార్థసారథియాదవ్, మునీంద్రయాదవ్, తుకారామ్, సుధాకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, సురేష్‌యాదవ్, భూలక్ష్మి, పళణి, తోకల రమేష్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు


పాలినేనివారిపల్లెలో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు

పాకాల, ఏప్రిల్ 1: మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ పాలినేనివారిపల్లెకు చెందిన 10 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని వీరికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుండ్లూరు చిట్టిబాబు, గుండ్లూరు సుగుణమ్మ, గుండ్లూరు హరీష్, గుండ్లూరు వాసు, తలారిపల్లెకు చెందిన కె.దాము, పి.మదన తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య


ప్రేమ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

శ్రీరంగరాజపురం/రామచంద్రాపురం, ఏప్రిల్ 1: ప్రేమ విఫలమై ఓ సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామచంద్రాపురం మండలం అనుపల్లె గ్రామ పంచాయతీ ఉప్పిలివంకకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు ప్రేమ్‌కుమార్ (27) ఏఎంపురం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఎస్‌ఆర్‌పురంలోనే ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ స్థానికంగా ఓ మహిళ ప్రేమలో పడ్డాడు. ఆమె పెళ్లికి అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. అద్దె ఇంట్లోనే ఆదివారం రాత్రి కమ్మీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారంతో సోమవారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుళాయప్ప తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.కాగా ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. వారు ఉప్పిలివంకకు తీసుకురావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తిరుపతి

పింఛన్ల పంపిణీపై వైసీపీ హైడ్రామా

- చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నం
- తెలుగు యువత విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న తెలుగు యువత నేతలు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 1: పెన్షన్ల పంపిణీ విషయంలో వైసీపీ హైడ్రామా చేస్తోందని, చెల్లింపులు చేయలేక టీడీపీ అధినేత చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ స్వలాభం కోసం నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. అవ్వాతాతలకు ఇవ్వాల్సిన పెన్షన్‌ను నిలుపుదల చేసి, నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ రెండు నెలలు పెన్షన్ పంపిణీని ఆపేసి, వచ్చే టీడీపీ ప్రభుత్వంపై భారం వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ ఐదేళ్లు వలంటీర్లను వాడుకుని అవసరం తీరిపోయాక నట్టేట ముంచేశారని మండిపడ్డారు. వలంటీర్లపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రతిపక్షాలపై నిందలు మోపడం సరికాదన్నారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్ మాట్లాడుతూ చంద్రబాబును, బొజ్జల కుటుంబాన్ని విమర్శించే అర్హత శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి లేదన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆర్‌పి శ్రీనివాసులు, అధికార ప్రతినిధి తోట వాసు, నాయకులు కరణం సందీప్, రఫీ, రంజిత్‌నాయుడు, శ్రీరామ్ బాబి, సంతోష్‌రాయల్, లోకేష్ రాయల్, దిలీప్ రాయల్, గోపి, నవీన్, గుణ, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్వీయూలో మతి స్థిమితం లేని యువతి సంచారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: ఎస్వీ యూనివర్సిటీలో మతి స్థిమితం లేని యువతి సంచరిస్తోంది. 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన తమిళనాడుకు చెందిన ఆ యువతి వారం రోజులుగా వర్సిటీలో తనలో తాను ఏదో మాట్లాడుకుంటూ, భుజంపై దుస్తులు వేసుకుని అన్నపూర్ణ క్యాంటీన్, శ్రీనివాసా ఆడిటోరియం కేంద్రాల వద్ద సంచరిస్తోంది. ఈమెను ఎవరైనా చేరదీసి, వివరాలు రాబట్టి ఇంటికి చేర్చడమో, ఆసరా కల్పించడమో, ఆరోగ్యాన్ని బాగు చేయించడమో చేస్తే మంచిదని వర్సిటీ వర్గాలు సూచిస్తున్నాయి.

పోస్టల్ బ్యాలెట్‌పై దిశానిర్దేశం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి అధికారుల బాధ్యతలు, విధులను వివరించారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసులు, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వో అదితీసింగ్, నిషాంత్‌రెడ్డి, చంద్రముని పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ దఫా ఏపీపీజీ సెట్-2024 నిర్వహణ బాధ్యతను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి ప్రభుత్వం అప్పగించింది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్‌ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ తదితర కోర్సులు రాష్ట్రంలోని పలు వర్సిటీలు నిర్వహిస్తున్నాయి. వీటి ప్రవేశానికి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. సోమవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. సెట్స్.ఏపీసీహెచ్ఈ.ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మే 4వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రూ.500 రుసుంతో మే 15 వరకూ, రూ.1000తో మే 25వ తేదీదాకా గడువుంది. జూన్ 10 నుంచి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిందే!

మేమంతా సిద్ధం సభలకు 250బస్సుల తరలింపు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 1: వైసీపీ నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం సభలకు 250 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. మంగళ, బుధ, గురువారాల్లో మదనపల్లె, పీలేరు, నాయుడుపేటలలో మేమంతా సిద్ధం సభలు నిర్వహిస్తున్నారు. జనసమీకరణకు బస్సులను తరలించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు బస్సుల కొరత తప్పదు. ఈ క్రమంలో ప్రజలకు మళ్లీ ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు. ప్రజలు తాత్కాలికంగా ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందేనని ఆర్టీసీ యాజమాన్యం చెప్పకనే చెబుతోంది.

మారుమూల ప్రాంతాల్లోనూ 4జీ సేవలు

- బీఎస్ఎన్ఎల్ జీఎం అమరేంద్ర రెడ్డి

తిరుపతి సెంట్రల్ ఏప్రిల్1: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 4జీ సేవలు అందించే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని, మారుమూల ప్రాంతాల్లోనూ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని జీఎం అమరేంద్ర రెడ్డి తెలిపారు. గ్రామాల్లో కూడా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి 110 టవర్లు నిర్మించి, మరో మూడు నెలల్లో సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. తిరుపతిలో 30 టవర్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు.

స్తంభాలను అలాగే వదిలేశారు



రోడ్డుపైనే వదిలేసిన విద్యుత్ స్తంభాలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 1: అలిపిరి, చెర్లోపల్లె రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలను తొలగించి అండర్ కేబుల్స్ ఏర్పాటు చేశారు. అయితే తొలగించిన స్తంభాలను ప్రత్యేక వ్యర్థాల నిల్వ కేంద్రానికి తరలించకుండా అలాగే వదిలేశారు. సమీపంలోనే అడవులు ఉండడంతో విష సర్పాలు చేరుతున్నాయి. రాత్రిపూట వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఆ స్తంభాలను అక్కడి నుంచి తరలించాలని పలువురు కోరుతున్నారు.

నూతన బస్సుషెల్టర్ల ఏర్పాటు



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 1: అలిపిరి, చెర్లోపల్లె రహదారికి ఇరువైపులా బస్సు షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఆ మార్గంలో సైన్స్‌సెంటర్, ఆస్పత్రులు, సంస్కృత విద్యాపీఠం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, జూలాజికల్‌పార్కు, పర్యాటకాభివృద్ధి సంస్థ వంటి భవన సముదాయాలు ఉండడంతో నిత్యం ప్రజల రాకపోకలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బస్సు వచ్చేంత వరకు రోడ్డుపై ఎర్రటి ఎండలో వేచి ఉండడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ఆ మార్గంలో బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయడంతో హర్షం వ్యక్తమవుతోంది.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ప్రారంభం



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతి (విద్య), ఏప్రిల్ 1: తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సోమవారం పాలిసెట్‌కు ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథ రెడ్డి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. 130 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని, ఈనెల 24వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో అహోబిలం మఠాధిపతి



శ్రీవారి ఆలయంలో రంగనాథ యతీంద్ర మహాదేశికన్

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): అహోబిలం మఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.మహాద్వారం నుంచి శిష్య బృందంతో ఆలయంలోకి వెళ్లిన యత్రీంద మహాదేశికన్ ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

మఠం తరపునే ఆభరణాలు చేయించాం

అహోబిలం దేవస్థానానికి తమ మఠం నుంచే ఆభరణాలు చేయించాం తప్ప దేవస్థానం నుంచి ఎలాంటి ఆర్థిక సాయాన్ని పొందలేదని రంగనాథ యత్రీంద మహాదేశికన్ తెలిపారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.అహోబిలంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగాయని, ఈవో ధర్మారెడ్డి కూడా వెళ్లి వచ్చారంటూ టీటీడీ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు వ్యాఖ్యలు చేసినట్టుగా ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన క్రమంలో మీడియా అడిగిన ప్రశ్నలకు మఠాధిపతి స్పందించారు. రమణదీక్షితులు చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. దేవస్థానం నుంచి పైసా కూడా తాము తీసుకోలేదన్నారు. ధర్మారెడ్డి తమ మఠానికి రాలేదని బదులిచ్చారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,224 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,093 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి ఆలయంలో మొదలైన రుగ్వేద పారాయణం

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో సోమవారం రుగ్వేద పారాయణం మొదలైంది. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12 మంది నిష్ణాతులైన వేదపండితులు పాల్గొని పారాయణం చేశారు. లోకకల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ 2020 ఏప్రిల్ 11వ తేదీ నుంచి టీటీడీ చతుర్వేద పారాయణం ప్రారంభించింది. మొత్తం నాలుగు వేదాల్లోని ఐదు శాఖలు పారాయణం చేశారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. చతుర్వేద పారాయణం వల్ల అనంతమైన ఫలితం సిద్ధిస్తుందని ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ ప్రాజెక్ట్ అధికారి ఆకెళ్ల విభీషణ శర్మ తెలిపారు.

రేపటి నుంచి పద్మావతీ వర్సిటీలో ఒంటిపూట తరగతులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: పద్మావతీ మహిళా యూనివర్సిటీలో బుధవారం నుంచి ఒంటి పూట తరగతులు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ రజని సోమవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఇదే విధంగా ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించారు

- ఐదేళ్లూ అరచేతిలో వైకుంఠం
- ప్రొసీడింగ్స్ ఇచ్చినా ఫలితమేదీ
- పరిష్కారం కాని శెట్టిపల్లి భూవివాదం



శెట్టిపల్లి భూములు

తిరుపతి (జీవకోన), మార్చి 31: శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారంలో వైసీపీ పాలకులు అరచేతిలో స్వర్గం చూపించారు. అయిదేళ్లూ నాన్చి చివరకు నరకం చూపించారు. ప్రభుత్వ తీరుపై రైతులు, ప్లాట్ల కొనుగోలుదారులు పెదవి విరుస్తున్నారు. తిరుపతికి కూతవేటు దూరంలో శెట్టిపల్లి భూములున్నాయి. రైతులకు 348.77 ఎకరాలు, ప్లాట్ల కొనుగోలుదారులకు 123.09 ఎకరాలు ఉన్నాయి. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ప్రారంభించి సమస్య పరిష్కారానికి అడుగు ముందుకు వేసింది. పక్కాగా రెవెన్యూ సర్వే జరిపించే సమయంలో ఎన్నికలు రావడంతో అంతరాయం కలిగింది. తాము అధికారంలోకి రాగానే ఈ సమస్య పరిష్కరిస్తామని వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్లాట్ల కొనుగోలుదారులు ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిని కలిశారు. ఆయన హామీ కూడా ఇచ్చారు. నాలుగున్నరేళ్ల పాటు సర్వేలు, రీసర్వేలు, రికార్డుల పరిశీలన పేరుతో హక్కుదారులను తిప్పుతూ వచ్చారు. ఇటీవల భూ అభివృద్ధి, పంపిణీ అంశాన్ని తుడా నుంచి శ్రీకాళహస్తి మునిసిపాలిటీకి ప్రభుత్వం అప్పగించింది. సమస్య పరిష్కారం అయిపోయిందని జీవో కూడా వచ్చిందంటూ వైసీపీ నాయకులు హడావిడి చేశారు. గతేడాది ప్రొసీడింగ్స్ పేరుతో మభ్యపెట్టారు. జిల్లా అధికారుల చేత ప్రొసీడింగ్స్‌ను ఇప్పించారు. తీరా చూస్తే సమస్య పరిష్కారానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అర్థమైంది. ఓపిక నశించిన హక్కుదారులు ఇటీవల ఇల్లు కట్టుకునేందుకు స్థలంలోకి వెళితే రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఎన్నికల కోసమే ప్రొసీడింగ్స్ తతంగాన్ని నడిపినట్లు అర్థం చేసుకున్నారు. పాలకులు మాత్రం శెట్టిపల్లి భూములపై పబ్లిసిటీని దంచేస్తున్నారు. అక్కడ ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తామంటూ హామీలను గుప్పిస్తున్నారు. భూములపై కోర్టులో ఈమధ్య కేసులు నమోదవుతున్నాయి. సమస్యను నాన్చేందుకు నేతలే కోర్టు కేసును తెరపైకి తెచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకులపై పూర్తిగా నమ్మకం పోయిందంటూ స్థలాల కొనుగోలుదారులు, రైతులు విమర్శిస్తున్నారు.

సారూ... మా సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్‌లో అధికారులకు వినతులు



అర్జీదారుల సమస్యలు వింటున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1: 'సమస్యలపై పరిష్కారం కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం.. ఎన్నికల కోడ్ పేరుతో అధికారులు ఇప్పుడు కాదు మళ్లీ రండి అంటూ తిప్పి పంపుతున్నారు' అని కొంతమంది అర్జీదారులు కలెక్టరేట్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల నేపథ్యంలో స్పందన కార్యక్రమం రద్దయినా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టరేట్‌లో అధికారులు సోమవారం ఫిర్యాదులు స్వీకరించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు వాటిని పరిష్కరించాలని డీఆర్వో పెంచలకిషోర్ ఆదేశించారు.

పొలంలో నిమ్మచెట్లు పీకేశారు



డక్కిలి మండలం దగ్గవోలు గ్రామంలో 16 ఏళ్లుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాం. ఆ భూమిలో 260 నిమ్మచెట్లను నాటాం. గ్రామానికి చెందిన కృష్ణయ్య, నరసింహులు, వరలక్ష్మి వాటిని పెరికివేశారు. ఇది మా భూమి అంటూ దౌర్జన్యం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆ పొలానికి డీకేటీ పట్టా ఇస్తే సాగు చేసుకుంటాం.

- చంద్రశేఖర్, దగ్గవోలు, డక్కిలి మండలం

హామీల అమలులో వైసీపీ విఫలం : టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 1: ఎన్నికల సమయంలో సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడని టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయలేని సీఎం ఏ మొహం పెట్టుకుని బస్సుయాత్రకు వస్తున్నారో చెప్పాలన్నారు. పాదయాత్రలో ఇచ్చిన 51 హామీలకు గాను ఒక్కటి మాత్రమే అమలు చేసి మిగిలిన వాటిని గాలికి వదిలేశారని విమర్శించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల వారీగా 480 హామీలు ఇస్తే అందులో మూడు నెరవేర్చి, 9 పాక్షికంగా అమలు చేశారని అన్నారు. మద్యపాన నిషేధాన్ని పూర్తిగా అమలు చేసి తర్వాతనే ప్రజలను ఓటు అడుగుతానని చెప్పిన జగన్ ఇప్పుడు ఏమి సమాధానం చెబుతారని నిలదీశారు. శ్రీకాళహస్తిలో విమానాశ్రయం కోసం తీసుకున్న భూములను తిరిగి ఇప్పిస్తానని, సత్యవేడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల భూములకు అండగా ఉంటానని, నిరుద్యోగ యువతకు శ్రీసిటీలో ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి తర్వాత పట్టించుకోలేదన్నారు. చేనేతలకు సైతం మొండిచేయి చూపించారని విమర్శించారు. పెన్షన్ల పంపిణీలోనూ డ్రామా ఆడుతున్నారన్నారు. ఈ సమావేశంలో చేజర్ల మనోహరాచారి పాల్గొన్నారు.

శంకర్ రెడ్డి అనుచరులతో ఆరణి సమావేశం



తిరుపతి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ మాజీ చైర్మన్ దివంగత కందాటి శంకర్ రెడ్డి అనుచరులతో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు సోమవారం సమావేశమయ్యారు. శంకర్ రెడ్డి అభిమానులు, అనుచరులను కందాటి సురేష్ రెడ్డి ఆయనకు పరిచయం చేశారు. 2001 మున్సిపల్ ఎన్నికల్లో శంకర్ రెడ్డి గెలుపునకు తనవంతు కృషి చేశానని ఆరణి చెప్పారు. శంకర్ రెడ్డి తరహాలోనే తానూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కందాటి మిథున్ రెడ్డి, జేడబ్ల్యు విజయకుమార్, సత్యవతి, ఆశాలత, పద్మనాభ రెడ్డి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి అన్నా రామకృష్ణయాదవ్ రాజీనామా



అనుచరులతో కలిసి వస్తున్న అన్నా బ్రదర్స్

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 1: జీవకోన మాజీ సర్పంచ్ అన్నా రామకృష్ణయాదవ్‌తోపాటు పలువురు వైసీపీకి రాజీనామా చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ వద్దకు దాదాపు 500 మంది అనుచరగణం, నాయకులతో కలిసి చేరుకున్న ఆయన మాట్లాడుతూ తాము ఏనాడూ పదవులను ఆశించలేదన్నారు. అయితే వైసీపీలో ఆది నుంచి తమ కుటుంబాన్ని అణగదొక్కే ప్రయత్నం చేశారని చెప్పారు. మేయర్ పదవి ఇస్తామని ఆశ చూపించి తమ కుటుంబ ప్రాబల్యం తగ్గించే నీచ రాజకీయాలు చేశారని అన్నారు. అందుకు నిరసనగా రాజీనామాలు చేస్తున్నామన్నారు. తనతోపాటు భార్య మాజీ సర్పంచ్ అన్నా మల్లీశ్వరి, మాజీ ఎంపీటీసీలు, కుల సంఘ నాయకులు రాజీనామా చేశామన్నారు. బీసీ నేత అన్నా రామచంద్రయాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాటలకు, ఆయన ప్రవర్తనా శైలికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. పదవుల కోసం దిగజారిపోయే వ్యక్తిత్వం తమకు లేదన్నారు. భూమన కుటుంబాన్ని ఓడించేందుకు భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీలు వెంకటేష్, శేఖర్ యాదవ్, బాలిరెడ్డి, చిరంజీవి, బుజ్జమ్మ, మునస్వామి, ఆదికేశవులు పాల్గొన్నారు.

'అన్నా' మీవెంటే నడుస్తాం

తిరుపతి అర్బన్: అన్నా రామచంద్రయ్యయాదవ్, రామకృష్ణయాదవ్ వెంటే నడుస్తామని అఖిల భారత యువజన యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌యాదవ్ స్పష్టం చేశారు. వైసీపీకి రాజీనామా చేసిన అన్నా సోదరులను సోమవారం ఆయన కలిసి తన మద్దతు ప్రకటించారు. శంకర్‌యాదవ్ మిత్రబృందం హరిగణేష్, సాయి, ప్రవీణ్, వెంకటేష్, భాను, మోహన్, అనిల్, శీను, రాజేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఇవేనా సూపర్ స్పెషాలిటీ సేవలు!

- రుయాలో రోగులను పట్టించుకునే నాథులేరి





రోగులు లేక వెలవెలబోతున్న ఓపీ విభాగం - అత్యవసర విభాగం ముందు ఆక్సిజన్ సిలిండరుతో రోగి



రోగిని చేతులపై తీసుకువెళుతున్న సహాయకులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 1 : రుయాస్పత్రిలో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే ఆ మేరకు సేవలు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి. సోమవారం ఆస్పత్రి ఆవరణలో రోగులను పట్టించుకునే వారు లేక ఆక్సిజన్ సిలిండర్లతో అత్యవసర విభాగం ముందు నిరీక్షిస్తుండడం, సాయం చేసేవారు లేక సహాయకులే చేతులపై తీసుకెళుతుండటం వంటి దృశ్యాలు కనిపించాయి. అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో చెప్పడానికి ఈ చిత్రాలే నిదర్శనంగా చెప్పవచ్చు. కాగా, సోమవారం ఓపీ తీసుకోవాలంటే గగనమే. సాధారణ రోజుల్లో దాదాపు వెయ్యి మంది రోగులు ఓపీకి వస్తే ఒక్క సోమవారం మాత్రమే ఈ సంఖ్య 1500 దాటుతుంది. వైద్యుల, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సోమవారం ఓపీ విభాగంలో రోగులు లేక వెలవెలబోయింది. 800 మంది రోగులు కూడా రాకపోవడంతో ఉదయం 11.30 గంటలకే ఖాళీగా కనిపించింది.

పెన్షన్లు ఇవ్వలేక టీడీపీపై అభాండాలా: పాశం



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 1: రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టేసిన వైసీపీ ప్రభుత్వం నిధుల కొరతతో పెన్షన్లు అందించలేక టీడీపీపై అభాండాలు మోపడం సరికాదని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ల సొమ్ముతో పాటు ఇతర నిధులు రూ.13వేల కోట్లు సొంత కాంట్రాక్టర్లకు వైసీపీ ప్రభుత్వం దోచిపెట్టిందన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎన్నికల కమిషన్, టీడీపీపై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. పెన్షన్లకు సంబంధించిన నిధులను ట్రెజరీలో జమ చేయకుండానే అసత్యప్రచారాలు చేయడం తగదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతినెలా 1వ తేదీ రూ. 4వేల పెన్షన్ ఇంటి వద్దే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇకనైనా అసత్యప్రచారాలు మానుకోని పేదలకు పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని సునీల్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, పెంచలయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతిపాలు

గూడూరు, ఏప్రిల్ 1: వైసీపీ ప్రభుత్వ అసమర్థత పాలన వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని విందూరు, సంతదాసుపల్లి, రామలింగాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెంచివేయడంతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లగలిగిన నాయకుడు చంద్రబాబునాయుడేనన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి ప్రజాప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను ఆహ్వానించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మల్లికార్జున్‌రెడ్డి, పెంచలరెడ్డి, నారాయణరెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, పల్లంపర్తి మధురెడ్డి, మట్టం శ్రావణి, ఇనుకుర్తి మల్లికార్జున్‌నాయుడు, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమిని గెలిపించండి



ప్రచారంలో సంధ్యారాణి, టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 1: రాష్ట్రాభివృద్ధి కోసం ఉమ్మడి కూటమిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక రాణిపేట ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రానికి దోచుకోవడమే పనిగా పాలన సాగించారన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడంతో పాటు సంక్షేమ పథకాలు అందాలంటే చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నిమ్మకాయల నరసింహులు, తిరుపాల్, కృష్ణకుమారి, పృధ్వీ, రవి, అశోక్, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, శ్రీదేవి, తాళ్ల సుబ్బమ్మ, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, ఏప్రిల్ 1: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటర్లందరూ ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఒకటో పట్టణ సీఐ పాపారావు అన్నారు. సోమవారం పట్టణంలో పారామిలటరీ సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా వారిలో ధైర్యం నింపేందుకు పారామిలటరీ సిబ్బందితో కవాతు నిర్వహించామని తెలిపారు. ఓటర్లను ఎవరైనా ఇబ్బందులు పెట్టినా, ప్రలోభాలకు గురిచేసినా కఠిన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ రవికిరణ్, పారామిలటరీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

పెళ్లకూరు, ఏప్రిల్ 1: మండలంలోని తాళ్వాయిపాడు, శిరసనంబేడు గ్రామాల్లో సోమవారం ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కేవీఆర్వీ ప్రసాద్‌రావు, ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎన్నికల నియమావళిపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషిబాయి, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్, ఏఎస్‌వో మోహన్‌రావు, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణా, పంచాయతీ కార్యదర్శి జనార్దన్, సర్వేయర్ పూజిత, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగాప్రసాద్



గంగాప్రసాద్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 1: నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పసల గంగాప్రసాద్ ఎంపికైనట్లు సీనియర్ న్యాయవాది మండిగ సోమశేఖర్ తెలిపారు. అలాగే వైస్ ప్రెసిడెంట్‌గా పొట్లపూడి శ్రీనివాసులు, సెక్రటరీ వీరాస్వామి, జాయింట్ సెక్రటరీ రఫీ, ట్రజరర్ సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు అమర్‌నాథ్, నిత్య, పరుశురామయ్య, మోహన్‌కృష్ణ, సునీల్ ఎంపికయ్యారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో గంగాప్రసాద్‌ను న్యాయవాదులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరనాథ్‌రెడ్డి, దశయ్య మొదలియార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

తడ, ఏప్రిల్ 1: సామాజిక పింఛన్లను సచివాలయంలో పంపిణీ చేస్తామని ఎంపీడీవో ఆమోస్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 6,055 మంది లబ్ధిదారులకు రూ.1.85 కోట్ల పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం బ్యాంకుల్లో నిధులను జమచేసిన వెంటనే పింఛన్లను పంపిణీ చేస్తామని ఎంపీడీవో చెప్పారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వైభవంగా ఘటోత్సవం



ఘటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చిల్లకూరు, ఏప్రిల్ 1: ముత్యాలమ్మ జాతర సందర్భంగా సోమవారం ఘటోత్సవం నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు రమణయ్య ఇంటి వద్ద తాటాకుల గుడిసె ఏర్పాటు చేసి, అందులో ఘటం ఉంచి పూజలు చేశారు. అనంతరం ఘటాన్ని నెత్తిపై పెట్టుకుని తప్పెట్లు, మంగళవాయిద్యాల నడుమ తూర్పుకనుపూరు, ఈదల వారిపాళెం, కొమరావారిపాళెం, రావులవారిపాళెం, పోసిన వారిపాళెం గ్రామాల్లో ఊరేగిస్తూ భక్తులకు ఆహ్వానం పలికారు.

ముత్యాలమ్మ హుండీ లెక్కింపు



ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి హుండీ లెక్కింపు నిర్వహించారు. మూడు నెలల్లో అమ్మవారికి భక్తులు నగదు రూపంలో హుండీ ద్వారా చెల్లించిన కానుకలను లెక్కించగా రూ.14,78,120 ఆదాయం వచ్చినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి ముత్యాలమ్మ జాతర



ముత్యాలమ్మ దేవస్థానం - బంగారుచీర అలంకరణలో ముత్యాలమ్మ, పోలేరమ్మ (ఫైల్‌ఫొటోలు)

చిల్లకూరు, ఏప్రిల్ 1: చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మంగళవారం రాత్రి గంగమిట్ట మీద ఘటం నిలిపి కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తీసుకువచ్చి తాటాకు గుడిసెలో తాత్కాలికంగా ప్రతిష్ఠించడంతో జాతర మొదలవుతుంది. జాతరలో ముత్యాలమ్మతో పాటు పోలేరమ్మకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ.

శాక్తేయ పద్ధతిలో పూజలు

నేటి చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు, ఈదలవారిపాళెం, పోసినవారిపాళెం, రావులవారిపాళెం గ్రామాలు 1918కి పూర్వం వెంకటగిరి రాజుల పాలనలో ఉండేవి. ఈ ప్రాంతాలకు అధిపతులుగా ఉన్న వెంకటగిరి రాజులు తూర్పు కనుపూరులో సింహాద్రి రామలింగయ్యశెట్టి ద్వారా శక్తి స్వరూపిణి అయిన ముత్యాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసినట్లు స్థానికుల కథనం. అప్పటి నుంచి ఏటా ఉగాది పర్వదినానికి వారం ముందు మంగళవారం నుంచి గురువారం వరకు జాతర నిర్వహించడం ఆనవాయితీ. 1942లో రాతిగోడలు పూరికప్పుతో నిర్మించి పూజలు నిర్వహించేవారు. అదేవిధంగా పోతురాజు చలుకను కూడా ఏర్పాటు చేసి పూజలు జరిపించేవారు. 1960లో వచ్చిన తుఫాను తాకిడికి గ్రామాలు అల్లకల్లోలం కావడంతో ముత్యాలమ్మ దేవస్థానం కూడా ధ్వంసమైంది. అమ్మవారి విగ్రహం కుడిచేయి విరిగిపోయింది. 1962లో సింహాద్రి రామలింగయ్యశెట్టి కుటుంబీకులు ఈ దేవాలయాన్ని పునర్నిర్మించారు. 1982లో అమ్మవారి నూతన బింబప్రతిష్ఠ జరిగింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా అమ్మవారి జాతర నిర్వహిస్తున్నారు. 1991 నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి పరిచారు. 1999లో దేవస్థాన జీర్ణోద్ధరణ మహాకుంభాభిషేక కార్యక్రమాలు జరిగాయి. అప్పటి నుంచి పూజలు శాక్తేయ పద్ధతిలో నిర్వహిస్తున్నారు.

2నుంచి 5వ తేదీ వరకు జాతర

జాతరలో భాగంగా 2వ తేదీన మంగళవారం రాత్రి పోలేరమ్మ నిలుపుదల, 3న యార గురునాథ స్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం, గొల్లల వేడుకలు, 4వ తేదీ పగలు గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మణ్ణి ఉయ్యాల సేవ జరుగుతుంది. 5న శుక్రవారం ఉదయం పోలేరమ్మను సాగనంపే ఉత్సవం, వేలంపాటలు నిర్వహిస్తారు.

భక్తులకు ఏర్పాట్లు

జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. అమ్మవారి జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమినాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రానున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో భక్తులకు సౌకర్యార్థం తాగునీరు, వైద్య సదుపాయం, మరుగుదొడ్ల ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు వివిధ సేవాసంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందజేయనున్నారు. రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గూడూరు, నెల్లూరు, కోట, వాకాడు, చిట్టమూరు, గుమ్మళ్లదిబ్బ, నాయుడుపేట, సూళ్లూరుపేట, నెల్లూరు, వెంకటగిరి నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. నాలుగురోజులు పాటు జరిగే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆర్డీవో కిరణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవ్వా తాతలను మోసం చేసిన జగన్: లక్ష్మీసాయిప్రియ



6వ వార్డులో కరపత్రాలు అందజేస్తున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 1: ఓటమి తప్పదని గ్రహించిన సీఎం జగన్ సంక్షేమ పథకాల నిధులను దారిమళ్లించి అవ్వాతాతలను మోసం చేశారని వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ విమర్శించారు. సోమవారం ఆమె పట్టణంలోని 6వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పింఛనుదారులకు ఇవ్వాల్సి రూ.13 వేల కోట్ల నిధులను తన అనుచరులైన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని ఆరోపించారు. గడిచిన ఐదేళ్ల అరాచకపాలన సాగించిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో వున్న వనరులను దోచుకోవడమే కాకుండా చివరకు అవ్వా తాతలకు ఇచ్చే పింఛను సొమ్ము కూడా దారి మళ్లించడం దారుణమన్నారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితే ప్రజల ఆస్తులకు కూడా రక్షణ లేకుండా పోతుందని హెచ్చరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అవ్వా తాతలకు పింఛను రూ.4 వేలకు పెంచి ఇంటికెళ్లి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర్, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథనాయుడు, సామల లక్ష్మీపతి, జానపాటి మురళి, శ్రీరాంబాబు, పప్పు చంద్రమౌళి రెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, ముప్పాళ గురువేంద్ర నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపండి: కురుగొండ్ల



కురుగొండ్లను సన్మానిస్తున్న వైసీపీ నాయకుడు అరుణాచలం

డక్కిలి, ఏప్రిల్, 1: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు అరాచక పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజలకు పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన మండలంలోని వెంబులూరు, నరసనాయుడుపల్లి, దేవులపల్లి, పాతనాలపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన కుమార్తె లక్ష్మీసాయిప్రియను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలనను చూసిన ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని వైసీపీ నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారని, వారి ప్రయత్నాలను ప్రజలే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తాను ఎమ్మెల్యేగా వున్న సమయంలో ప్రారంభించిన ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులను వైసీపీ ప్రభుత్వం ఆపేసి రైతులకు తీరని ద్రోహం చేసిందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రిజర్వాయరు నిర్మాణాన్ని పూర్తిచేస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన వెంబులూరు గ్రామంలో ఇటీవల మరణించి పెద్ద గుండయ్య కుటుంబాన్ని పరామర్శించారు. దేవులపల్లిలో వైసీపీ నేత వెంకట్రామిరెడ్డి ఇంటికి వెళ్లి టీడీపీలో చేరాలని కోరగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే పాతనాలపడులో వైసీపీ నాయకుడు అరుణాచలం కురుగొండ్ల రామకృష్ణకు స్వాగతం పలికి సన్మానించారు. నరసనాయుపల్లిలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి కురుగొండ్ల పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ మాజీ చైర్మన్ చెలికం భాస్కరరెడ్డి, మచ్చల వేణు, వెంకటాద్రి, పెంచలరెడ్డి, మునికృష్ణయ్య, సురేంద్ర, రాంబాబు, నల్లాని రామచంద్రయ్య, పీపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీపై బురదచల్లేందుకే పింఛన్ల డ్రామా: నెలవల

పెళ్లకూరు, ఏప్రిల్ 1: ఎన్నికల్లో ప్రయోజనం పొందడం కోసమే ప్రభుత్వం పింఛన్ల పంపిణీ విషయంలో డ్రామా ఆడుతోందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం పెళ్లకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పింఛన్లు పంపిణీ చేయకూడదని తమ పార్టీ నాయకులు ఎప్పుడూ చెప్పలేదన్నారు. పింఛన్ల పంపిణీ సాకుతో ఇంటింటికీ వెళ్లి వైసీపీకి అనుకూలంగా వలంటీర్లు ప్రచారం చేస్తున్నారని, అందుకే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడం జరిగిందన్నారు. పరిపాలన చేతకాక ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జగన్ పింఛన్లు పంపిణీ చేసేందుకు డబ్బులు లేక టీడీపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

అభివృద్ధికి... కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు: పరసా



కలిపేడులో పరసా వెంకటరత్నం, విజయశ్రీకి సన్మానం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 1: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్... చంద్రబాబు అని మాజీమంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. మండలంలోని కూచివాడ, కలిపేడు, పండ్లూరు గ్రామాల్లో సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరసా రత్నం మాట్లాడుతూ చంద్రబాబు హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. అభివృద్ధితో రాష్ట్రానికి అనేక పరిశ్రమలను రప్పించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. రైతాంగాన్ని కూడా ఆదుకున్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నెలవల విజయశ్రీ మాట్లాడుతూ వైద్య రంగాన్ని వదిలి ప్రజాసేవకోసం రాజకీయాల్లోకి వచ్చానని, నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాం ప్రసాద్, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజేంద్ర, కిష్టయ్య, మస్తానయ్య, చక్రపాణి, సుబ్బరాయులు, పరసా వెంకటరాజు, సుజాతమ్మ, దయాకర్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. సోమవారం సూళ్లూరుపేట పట్టణంలో టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పరసా రాష్ట్రంలో అరాచక పాలనకు కౌంటౌడౌన్ ప్రారంభమైందని, ప్రజలు ఎక్కడికి వెళ్లిన టీడీపీకి బ్రహ్మారథం పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు నలజాం రాము, నాపా మునిరాజా, గంపల రవి, పూడి రవి, మధు, సుజాత, సరళ, బుజ్జిబాబు, మునస్వామి, బుద్ధి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భట్ల కనుపూరులో గంధోత్సవం

ఓజిలి, ఏప్రిల్ 1: మండలంలోని భట్ల కనుపూరులో సోమవారం రాత్రి మస్తాన్‌వలి, ఖాదర్‌వలి ప్రథమ గంధోత్సవ వేడుకలు నిర్వహించారు. గున్నం సేవా ట్రస్టు అధినేత గున్నం మధుసూదనరెడ్డి దర్గా, గంధోత్సవ దాతగా వ్యవహరించారు. మధుసూదనరెడ్డి ఇంటి వద్ద నుంచి ఫకీర్ వాయిద్యాలతో జెండాలు చేతపట్టి గంధం తీసుకుని దర్గా వద్దకు వెళ్లి పంచిపెట్టారు. నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ సీనియర్ నాయకులు బచ్చల రవీంద్రరెడ్డి, నెలవల రాజేష్, వెంకటసుబ్బరాజు. దామోదరరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి



ఆదిమూలంను సన్మానిస్తున్న గాండ్ల సంఘ నాయకులు

నారాయణవనం, ఏప్రిల్ 1: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గాండ్ల సంఘం నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకులు శివకుమార్, రమేష్, ఆర్ముగం, రవి, ఆర్‌డీ ఏకాంబరం ఆధ్వర్యంలో హరి, శేఖర్, యువరాజ్, బాల, నాగరాజు, రవిశేఖర్, శివకుమార్, వి.రవి, బి.భాస్కర్, పి.షణ్ముగం, ఆర్కాడు సూరి, గోవింద్, ఎన్.వెంకటేష్ తదితరులు టీడీపీలో చేరారు. ఆదిమూలంను గాండ్ల సంఘ నాయకులు సన్మానించారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

నారాయణవనం, ఏప్రిల్ 1: మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ చిత్తూరు కండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాలయ్య మృతి చెందారు. ఆయన మృతదేహానికి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

చీప్ పాలిటిక్స్ మానుకో జగన్: భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 1: సీఎం జగన్ చీప్ పాలిటిక్స్ చేయడం ఇకనైనా మానుకోవాలని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ హితవు పలికారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి సామాజిక భద్రతా పింఛన్లు ఇవ్వకుండా టీడీపీ, చంద్రబాబునాయుడు, ఎన్నికల కమిషన్ అడ్డుకుంటున్నాయని సీఎం జగన్, వైసీపీ, వారి అనుకూల మీడియా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. షెడ్యూల్ విడుదలయ్యాక మార్చి 16నుంచి 30వ తేదీ లోపు సుమారు రూ.13 వేల కోట్లు రాష్ట్ర ఖజానా నుంచి అనుకూల కాంట్రాక్టర్లకు బిల్లులను చెల్లించిన సీఎం జగన్ పింఛన్లుకు నిధులు లేక ఆ నెపాన్ని చంద్రబాబుపై రుద్దడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. వలంటీర్లను పార్టీ ప్రచార కార్యక్రమాలకు ఉపయోగిస్తూ వారి సస్పెన్షన్లకు, క్రిమినల్ కేసుల నమోదుకు జగన్ కారణం కాదా అని నిలదీశారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరినైనా బలిచేయడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్యని ధ్వజమెత్తారు. గత ఎన్నికల ముందు వైఎస్ వివేకానందరెడ్డి హత్య, కోడి కత్తి కేసును చంద్రబాబునాయుడుపై రుద్ది రాజకీయ ప్రయోజనాలు పొందిన జగన్ అమాయక ప్రజలను మోసం చేయడానికి ఎంతటికైనా బరితెగిస్తారని దుయ్యబట్టారు. ఇందులో భాగంగానే పింఛన్ల సొమ్మును తన అనుకూల కాంట్రాక్టర్లకు ముట్టచెప్పి పేదలకు పింఛన్లు ఇవ్వకుండా చంద్రబాబునాయుడు అడ్డుకుంటున్నారని అసత్య ప్రచారాలు చేయడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. వైసీపీ రాజకీయ ప్రయోజనాలకు సహకరించని వలంటీర్లను టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొనసాగిస్తామని, అలా వ్యవహరించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.4 వేల పింఛన్‌ను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించే బాధ్యత తమదని తేల్చి చెప్పారు.

బీసీలను దగా చేసిన జగన్: టీడీపీ



బీసీ సదస్సులో మాట్లాడుతున్న డీఎస్ గణేష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 1: నా బీసీలు అంటూ ఆప్యాయంగా పలికి వారిని అణగదొక్కిన సీఎం జగన్ క్షమార్హుడు కాదని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని కళ్యాణపురం వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ సదస్సును క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్ఎన్ ధనపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు బీసీలపై ప్రేమ కురిపించి ఓట్లు దండుకున్న జగన్ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బీసీలను దగా చేశారని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు కోత విధించడమే కాకుండా బీసీలపై అత్యాధికంగా దాడులు జరిగింది కూడా వైసీపీ ప్రభుత్వ హయాంలోనే అని ధ్వజమెత్తారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కరుణాకరణ్, మాజీ వైస్ చైర్మన్ డీఎస్ గణేష్ మాట్లాడుతూ బీసీలపై జరుగుతున్న దాడుల నివారణకే చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో బీసీల రక్షణ చట్టంను పొందుపరిచారని గుర్తుచేశారు. వార్డు ఇన్‌చార్జి వీడీ అశోక్ మాట్లాడుతూ బీసీల కష్టం గుర్తించిన చంద్రబాబునాయుడు వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు 50 ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.4 వేలు పింఛన్ పథకాన్ని ప్రకటించారని వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, కౌన్సిలర్ కేశవాచ్చారి, నాయకులు డీజీ ధనపాల్, ఏలుమలైరెడ్డి, బాల్‌రెడ్డి, కేశవ, చీరల మోహన్, శ్రీనివాసులు, నబీ మస్తాన్, సోము, ఇళయరాజా, పండారం మణి, ప్రసాద్, ముని, అయ్యప్పన్‌రెడ్డి, నాగరాజు, జ్యోతిబాబు, అరుణాచలరెడ్డి, చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలి : టీడీపీ



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 1: అవ్వ తాతలకు ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ, బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో ప్రతా‌ప్‌రెడ్డికి సోమవారం వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ పింఛన్లు సకాలంలో ఇవ్వకుండా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వైసీపీ కుట్ర చేస్తోందన్నారు. మండలంలో 14 సచివాలయాలలో 140 మంది సిబ్బంది ఉన్నారని వారంతా ఇంటింటికీ వెళ్లి రెండు రోజుల్లో పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు మునిచంద్రారెడ్డి, నాయకులు శివకుమార్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ఉషారాణి, బాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఆర్డీవో రవిశంకర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయం వద్ద దివ్యాంగులకు సోమవారం నిత్యావసర సరుకులను ఆయన చేతులు మీదుగా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, న్యాయవాది రాజేశ్వరరావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

బొజ్జల కుటుంబాన్ని విమర్శించే అర్హత ఎమ్మెల్యేకు లేదు : టీడీపీ

ఏర్పేడు, ఏప్రిల్ 1: మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి లేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అనేక పరిశ్రమలను తీసుకువచ్చరని తెలియజేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆ పరిశ్రమల్లో దోచుకుతిన్నారని ఆరోపించారు. అలాగే ప్రతిపక్ష పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వారిని ఇబ్బంది పెట్టడం తప్ప నియోజకవర్గాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బొజ్జల సుధీర్‌రెడ్డిని ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ మేరకు టీడీపీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులునాయుడు, నిరంజన్‌బాబు నాయుడు, గిరినాయుడు, సామా అంకయ్య, సీతాపతిఆచారి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, చిరంజీవులు నాయడు, పూల హేమాక్షి, పేరం నాగరాజునాయుడు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వరప్రసాద్‌కు సన్మానం



వరదయ్యపాళెం, ఏప్రిల్ 1: బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌ను వరదయ్యపాళెం మండలం యాదవ సామాజిక వర్గానికి చెందిన చిట్టిబోయిన జానకిరామయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జానకిరామయ్యను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ పేలి కార్మికుడికి గాయాలు



గాయపడిన దానిష్ అలీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1: బ్యాటరీ పేలి రోడ్డు నిర్మాణ కార్మికుడు గాయపడ్డారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ప్రైవేట్ రోడ్డు నిర్మాణ సంస్థ కార్యాలయం ఉంది. అక్కడి నుంచి రోడ్డు నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సోమవారం ఓ టిప్పర్ లారీ బ్యాటరీకి మరమ్మతులు చేస్తుండగా హఠాత్తుగా పేలిపోయింది. దానిష్ అలీ(30)అనే కార్మికుడి కళ్లపై యాసిడ్ పడడంతో అతడు గాయపడ్డాడు. అతడిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిందే!

మేమంతా సిద్ధం సభలకు 250 బస్సుల తరలింపు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 1: వైసీపీ నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం సభలకు 250 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. మంగళ, బుధ, గురువారాల్లో మదనపల్లె, పీలేరు, నాయుడుపేటలలో మేమంతా సిద్ధం సభలు నిర్వహిస్తున్నారు. జనసమీకరణకు బస్సులను తరలించారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు బస్సుల కొరత తప్పదు. ఈ క్రమంలో ప్రజలకు మళ్లీ ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు. ప్రజలు తాత్కాలికంగా ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందేనని ఆర్టీసీ యాజమాన్యం చెప్పకనే చెబుతోంది.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ప్రారంభం



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 1: తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సోమవారం పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్‌కు ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. 130 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని, ఈనెల 24వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ దఫా ఏపీపీజీసెట్-2024 నిర్వహణ బాధ్యతను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి ప్రభుత్వం అప్పగించింది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ తదితర కోర్సులు రాష్ట్రంలోని పలు వర్సిటీలు నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. సోమవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. సెట్స్.ఏపీసీహెచ్ఈ.ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మే 4వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రూ.500 రుసుంతో మే 15 వరకూ, రూ.1000తో మే 25వ తేదీదాకా గడువు ఉంది. జూన్ 10 నుంచి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,224 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,093 మంది తలనీలాలు సమర్పించారు.

వైసీపీ కుట్రతోనే పింఛన్ల ఆలస్యం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ : వైసీపీ కుట్రపూరితంగా నిధులు ఖాళీ చేయడంతోనే పింఛన్ల ఆలస్యం జరిగిందని టీడీపీ నాయకురాలు బొజ్జల నిషితారెడ్డి విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం పింఛన్ల జాప్యంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసి ఖజానా ఖాళీ చేశారని ఆరోపించారు. ఏప్రిల్ 3న పింఛన్లు పంపిణీ చేస్తారని సీఎం జగన్ పత్రిక గతంలోనే ప్రచురించిన కథనమే ఇందుకు నిదర్శనమన్నారు. కుట్ర చేసి మళ్లీ టీడీపీయే కారణమని ఆరోపించడం వైసీపీ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, కంఠా రమేష్ పాల్గొన్నారు.

వలంటీర్ రాజీనామా

నాగలాపురం, ఏప్రిల్ 1: టీపీ కోట గ్రామానికి చెందిన వలంటీర్ షబీర్ అహ్మద్ సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఎంపీడీవో బాబుకి అందించారు. ఇటీవల సత్యవేడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారంలో షబీర్ పాల్గొన్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాజీనామా చేశారు.

నవోదయకు మౌనిక ఎంపిక



ఏర్పేడు, ఏప్రిల్ 1: మండలంలోని కాట్రకాయలగుంట ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సి.మౌనిక నవోదయ పాఠశాలకు ఎంపికైంది. మౌనికను ఎంఈవో దయాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు అభినందించారు.

కళత్తూరులో కాంగ్రెస్ ప్రచారం

కేవీబీపురం, ఏప్రిల్ 1: మండలంలోని కళత్తూరు గ్రామంలో సోమవారం సత్యవేడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుజామణి ఇంటింటా ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సింగమాల జయరామిరెడ్డి, రామచంద్రయ్య, చల్లదొరై, పురుషోత్తం, నాదముని, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై నేడు చైతన్య ర్యాలీ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 1: ప్రజలంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఉదయభారతి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటర్లను చైతన్య పరిచేందుకు మంగళవారం తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, పోలీసు, విద్యాశాఖ తదితరశాఖల ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు.

ముక్కంటి ఆలయంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈవో నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1: ముక్కంటి ఆలయంలో భక్తులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించేలా మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. సోమవారం ఈవో నాగేశ్వరరావు క్యూలైన్లలో భక్తులకు మజ్జిగ అందించారు. వేసవి తీవ్రత దృష్ట్యా అన్నదాన విభాగం నుంచి ప్రతిరోజూ మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సందర్శన

పిచ్చాటూరు, ఏప్రిల్ 1: మండలంలోని ఐదు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ ప్రిసైడింగ్ అధికారులతో కలసి సందర్శించారు. పోలింగ్ కేంద్రాలకు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఆరోగ్య కేంద్రాల వసతి ఉందా లేదా అని ఆరా తీశారు. ఆయనవెంట పంచాయతీరాజ్ ఇంజనీర్ మణిబాబు, స్థానిక బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హత ఎమ్మెల్యేకి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న గురవారెడ్డి తదితరులు

ఏర్పేడు, ఏప్రిల్ 1: టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శించే అర్హత ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, టీడీపీ నాయకులు మండి పడ్డారు. సోమవారం వారు మాట్లాడుతూ చంద్ర బాబుతోపాటు, ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పలుచోట్ల భూములు కబ్జా చేయడం, ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విధ్వంసకరపాలన సాగుతోందన్నారు. ప్రజలు ఓట్ల రూపంలో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నార న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు కృష్ణవేణి, సుబ్రహ్మణ్యం, రమణ, మునెయ్య, గుణ యాదవ్, రమేష్, చంద్రశేఖర్ యాదవ్, రమణయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, సదాశంకర్, నిరంజన్, మునీంద్రయాదవ్, సుబ్రహ్మణ్యం, బాలాజీ, మణి, గోపీనాథ్ పాల్గొన్నారు.

అక్రమార్కుల జాబితాలో ఎమ్మెల్యే ఫస్ట్



మాట్లాడుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1: రాష్ట్ర వ్యాప్తంగా అక్రమార్కుల జాబితాతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మొదటి స్థానంలో ఉన్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు శ్రీకాళహస్తిలో నిర్వహించిన ప్రజాగళం సభ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సమష్టి కృషితో విజయవంతమైందన్నారు. శ్రీకాళహస్తి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని చంద్రబాబు ప్రకటించడం సంతోషకరమన్నారు. సభలో అశేష జన స్పందన చూసి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి మతి భ్రమించిందన్నారు. అందుకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు పేరును పలికే అర్హత కూడా ఎమ్మెల్యేకి లేదని హితువు పలికారు. బొజ్జల కుటుంబంపై అసత్య విమర్శలు చేస్తే సహించబోమన్నారు. ఇకనైనా వ్యక్తిగత దూషణలకు స్వస్తి పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిన్నల రవి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మేతభూమి విషయమై ఘర్షణ.. ఒకరికి గాయాలు



గాయపడిన శరవణ

కేవీబీపురం, ఏప్రిల్ 1: మేతభూమి విషయంపై ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఈ ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మండలం లోని మోరీస్‌కండ్రిగ గ్రామంలో సర్వే నెం.272/12లో 7.5 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు మేతభూమి ఉంది. ఇది గ్రామానికి సంబంధించినది. ఈ భూమిలో ఆ గ్రామానికి చెందిన శరవణ సోమవారం ఉదయం గడ్డివామి వేయడం మొదలుపెట్టాడు. అయితే మేతభూమిలో గడ్డివామి ఎలావేస్తావని గ్రామానికి చెందిన కుమార్, వెంకటేశ్వర్లు, డిల్లీ, దశరథయ్య తదితరులు అతడిని నిలదీశారు. దీనిపై వారిమధ్య వాగ్వాదం జరిగింది. శరవణకు అయ్యప్ప, వలగనాథం, విజయ్ తదితరులు మద్దతుగా మాట్లాడారు. ఇరువర్గాల వాదన ఘర్షణకు దారితీసింది. కుమార్ అనే వ్యక్తి కర్రతో శరవణపై తలపై కొట్టడంతో బలమైన గాయమైంది. కుటుంబసభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నజీరుద్దీన్, ఏఎస్ఐ లోకనాథం తెలియజేశారు.

ట్యాబ్‌లు, సెల్‌ఫోన్ల అప్పగింత



వరదయ్యపాళెం, ఏప్రిల్ 1: వరదయ్యపాళెం మండలంలోని ఇందిరనగర్ పంచాయతీకి చెందిన వలంటీర్లు తమ ట్యాబ్‌లు, ఫోన్లను ఎన్నికల నియమావళి ప్రకారం సోమవారం ఎంపీడీవో కార్యాలయానికి తిరిగి ఇచ్చేశారు. వాటిని పంచాయతీ కార్యదర్శి సీల్ వేసి భద్రపరిచారు.

తాగునీటి సమస్య రాకూడదు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

తొట్టంబేడు, ఏప్రిల్ 1: మండలంలోని వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను తాగునీటి పంపులు, బోరు మోటార్ల మరమ్మతులకు ఉపయోగించుకోవాలని కోరారు. పంచాయతీ ముఖ్యకూడలిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున సచివాలయ సిబ్బంది ఈ నెల మూడవ తేదీన సచివాలయాల్లో పెన్షన్ పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తరుణాక్షిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ సమావేశానికి ప్రజాప్రతినిధుల డుమ్మా

రేణిగుంట, ఏప్రిల్ 1: వైసీపీ సమావేశానికి ఆ పార్టీ ప్రతి నిధులు డుమ్మా కొట్టారు. సీఎం జగన్ ఈ నెలలో రేణి గుంటలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు జన సమీకరణ చేయడంపై చర్చించేందుకు సోమవారం పట్టణం లోని పార్టీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. అయితే మండల, పట్టణ నాయకులు రాలేదు. ఎంపీ గురు మూర్తి ఉన్నవారితోనే జనసమీకరణపై చర్చించారు. ఇప్పటి వరకు తమకు ఏమీ చేయలేదనే అసంతృప్తిలో మండల, పట్టణ నాయకులు ఉన్నారు. ఇప్పుడు మళ్లీ సమావేశానికి వెళితే జనసమీకరణ బాధ్యతలు అప్పగిస్తారని ముఖంచాటేశారని సమాచారం.

దాహం తీరే దారేది..?

- జగన్నకాలనీపై దయచూపని పాలకులు
- తాగునీటి కోసం పక్కగ్రామానికి
- గృహ అవసరాలకు గుంటనీరే శరణ్యం



గుంట నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 1: మండలంలోని రాచర్ల పంచాయతీ జగనన్న కాలనీ వాసులు దాహంతో అల్లాడిపోతున్నారు. మండలంలోని రాచర్ల పంచాయతీ జగనన్న కాలనీలో పలువురు ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. అయితే ఈ కాలనీలో మౌలిక వసతులు కల్పించలేదు. తాగునీటికి రెండుబోర్లు వేసినా ఫలితం లేకపోయింది. మరో బోరులో వచ్చే కాస్త నీరు ఆగిపోయింది. దీంతో వారం రోజులుగా తాగునీటి కోసం బిందెలు చేతబట్టి మండుటెండలో పక్కనే ఉన్న గ్రామం నుంచి తెచ్చుకుంటున్నారు. ఇక గృహ అవసరాలకు కూడా నీరు లేకపోవడంతో సమీపంలో ఉన్న మడుగులో మురుగునీటిని తెచ్చుకుంటున్నారు. మండే ఎండలకు ఇది కూడా రేపోమాపో ఎండిపోయే లా ఉంది. అప్పుడు తమ పరిస్థితి ఏమిటో అర్థంకావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం తాగునీటి వసతిలేని కాలనీలో తాము ఎలా జీవించాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు తాగునీటి వసతిని కల్పించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

పెన్షన్ల పంపిణీపై వైసీపీ హైడ్రామా

- చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నం
- తెలుగు యువత విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న తెలుగు యువత నేతలు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 1: పెన్షన్ల పంపిణీ విషయంలో వైసీపీ హైడ్రామా చేస్తోందని, చెల్లింపులు చేయలేక టీడీపీ అధినేత చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ స్వలాభం కోసం నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. అవ్వాతాతలకు ఇవ్వాల్సిన పెన్షన్‌ను నిలుపుదల చేసి, నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ రెండు నెలలు పెన్షన్ పంపిణీని ఆపేసి, వచ్చే టీడీపీ ప్రభుత్వంపై భారం వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ ఐదేళ్లు వలంటీర్లను వాడుకుని అవసరం తీరిపోయాక నట్టేట ముంచేశారని మండిపడ్డారు. వలంటీర్లపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రతిపక్షాలపై నిందలు మోపడం సరికాదన్నారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్ మాట్లాడుతూ చంద్రబాబును, బొజ్జల కుటుంబాన్ని విమర్శించే అర్హత శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి లేదన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆర్‌పి శ్రీనివాసులు, అధికార ప్రతినిధి తోట వాసు, నాయకులు కరణం సందీప్, రఫీ, రంజిత్‌నాయుడు, శ్రీరామ్ బాబి, సంతోష్‌రాయల్, లోకేష్ రాయల్, దిలీప్ రాయల్, గోపి, నవీన్, గుణ, నాగరాజు పాల్గొన్నారు.

చెరువు మాయం.. ఇళ్లు ప్రత్యక్షం

- వైసీపీ నాయకులకు పంపకాలు
- ప్రభుత్వ ధనంతో మురుగు కాలువ నిర్మాణం

కన్నెత్తిచూడని అధికారులు

రేణిగుంట, ఏప్రిల్ 1: ఎన్నికల వేళ వైసీపీ పెద్దలు తమవారికి మేళ్లు చేయడానికి ఎంతకైనా బరితెగిస్తున్నారు. ఏకంగా ఓ గుంటను పూడ్చివేసి ప్లాట్లు వేసి వైసీపీ ప్రజా ప్రతినిధులకు పంపకాలు చేసేశారు. రేణిగుంట పట్టణ పంచాయతీ పరిధిలోని జ్యోతినగర్‌లో ఓ పత్రిక కార్యాలయం ఎదురుగా ప్రధాన రోడ్డుకు ఆనుకుని సర్వే నెంబరు. 453/6 లో చెంగల్‌రాయలు గుంట 6.72ఎకరాల విస్తీర్ణంలో ఉంది. వర్షపునీరు కాలువల ద్వారా ఈ గుంట మీదుగా గురవరాజుపల్లి పెద్దచెరువులో కలు స్తుంది. ఎన్నికలు కోడ్ వచ్చేయడంతో అయినవారికి మేలు చేసేందుకు వైసీపీ నేత ఆజ్ఞతో ఈ గుంటను పూడ్చివేసి ప్లాట్లు లెక్కన స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు పంచుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు సైతం చేపట్టేశారు. ఇళ్ల వద్ద మురగుకాలువ రూ.5లక్షలతో నిర్మించుకునేశారు. మురుగు కాలువ నిర్మాణానికి అధికారులు ఎలా అనుమతి ఇచ్చారో వారికే తెలియాల్సి ఉంది.

ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.35కోట్లు ఉంటుందని అంచనా. ఇంత విలువైన ప్రభుత్వ గుంటను పూడ్చివేసి ఇళ్లను నిర్మించుకుని కరెంటు కనెక్షన్లు పొందే వరకు స్థానిక రెవెన్యూ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. అధికారులు గుంటను కబ్జా నుంచి కాపాడి వర్షా కాలంలో పెద్దచెరువుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మరోపక్క ఈ చెరువు వెనుక భాగాన రాత్రి సమయంలో భారీ మొత్తంలో మట్టిని తోలి మిగిలిన కొంత గుంటను సైతం కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు.





చెంగల్‌రాయలుగుంటను పూడ్చి ఇళ్లను నిర్మించుకుంటున్న వైసీపీ ప్రజాప్రతినిధులు, నిర్మించిన మురుగుకాల్వ